శుక్రవారం
08-09-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 79
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from
Vijayawada, Hyderabad, Visakapatnam,
Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

ప్రపంచ వృద్ధికి కేంద్రం 'ఆసియాన్'

ప్రపంచంలో క్లిష్ట పరిస్థితులు, అనిశ్చిత పరిస్థితులు నెలకొని ఉన్నాయని, ఉగ్రవాదం, భౌగోళిక రాజకీయ సంఘర్షణలు పెద్ద సవాళ్లుగా నిలిచాయని ఇండోనేసియా రాజధాని జకార్తలో జరిగిన ఆసియాన్-భారత్ 18వ తూర్పాసియా శిఖరాగ్ర సదస్సులో వక్తలు అన్నారు. సముద్రంలో సహకారం, ఆహార భద్రతపై రెండు ఉమ్మడి ప్రకటనలను సదస్సు ఆమోదించింది.

2లో

సార్వత్రిక ఎన్నికల ముందు 2018లో

ఆర్బీఐపై మోదీ సర్కార్ ఒత్తిడి నిజమే

- రూ.2-3 లక్షల కోట్ల మళ్లింపునకు కసరత్తు
- దొడ్డిదారి ప్రయత్నాలు
- మాజీ డిప్యూటీ గవర్నర్ ఆచార్య

న్యూదిల్లీ: గత సార్వత్రిక ఎన్నికలకు ముందు ప్రజాదరణ పథకాలకు ఖర్చు చేయడం కోసం కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నించిందని భారత రిజర్వు బ్యాంకు (ఆర్బీఐ) అప్పటి డిప్యూటీ గవర్నర్ ఆచార్య వెల్లడించారు. అందుకోసం 2018లో తన బ్యాలెన్స్‌షీట్ నుంచి రూ.2-3లక్షల కోట్లు తీసుకోవడానికి ప్రభుత్వంలోని కొంతమంది చేసిన ప్రయత్నాన్ని ఆర్బీఐ నిర్ద్వంద్వంగా తోసిపుచ్చినట్లు చెప్పారు. దీంతో ప్రభుత్వానికి, ఆర్బీఐకి మధ్య విభేదాలు ఏర్పడ్డాయన్నారు. పర్యవసానంగా ఎన్నడూ వినియోగించని ఆర్బీఐ చట్టంలోని సెక్షన్ 7 పునరుద్ధరణ ఆలోచన జరిగిందని తెలిపారు. 2018, అక్టోబరు 26న ఏడీ ష్రాఫ్ స్మారకోపన్యాసం చేసిన సందర్భంగా ఈ విషయాన్ని ఆచార్య తొలిసారి ప్రస్తావించారు. తాజాగా 'క్వెస్ట్ ఫర్ రిస్టోరింగ్ ఫైనాన్షియల్ స్టెబిలిటీ ఇన్ ఇండియా' పుస్తకానికి ముందుమాటలో దీని గురించి ఆర్థిక సంక్షోభం వేళ కేంద్ర బ్యాంకు దొడ్డిదారి మోనటైజేషన్ కసరత్తుగా వర్ణించారు. గత-ప్రస్తుత ప్రభుత్వ ఖాతాల్లో నుంచి ఆర్బీఐ ద్వారా ఓ పెద్దమొత్తాన్ని దారి మళ్లించేందుకు బ్యూరోక్రసీ, ప్రభుత్వంలోని మేధావులు కొందరు ప్రణాళిక రూపొందించారని పేర్కొన్నారు. ఈ పుస్తకం మొదటి సంపుటిని 2020లో ప్రచురించారు. ఆర్బీఐ ప్రతి సంవత్సరం లాభాల్లోని కొంత ప్రభుత్వానికి ఇవ్వకుండా దాస్తుంది. మూడేళ్లలో నోట్ల రద్దు (2016) క్రమంలో కేంద్రబ్యాంకు వచ్చిన లాభాలు ప్రభుత్వానికి మళ్లాయని ఆచార్య వెల్లడించారు. నోట్ల రద్దు సంవత్సరంలో కరెన్సీ ముద్రణ ఖర్చు చేసేదంతా కేంద్రానికి చేరింది. ఫలితంగా 2019 ఎన్నికలకు ముందు ప్రభుత్వ డిమాండ్

- మిగతా 2 లో

విజయవాడ కేంద్రంగా

నకిలీ మందుల దందా

- ఔషధ నియంత్రణ అధికారుల తనిఖీలు
- లక్షల విలువైన మందులు స్వాధీనం
- ఇద్దరిపై కేసు నమోదు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : విజయవాడ కేంద్రంగా నకిలీ మందుల వ్యాపారం జోరుగా సాగుతున్నట్లు బయటపడింది. నగరంలోని వన్‌టౌన్, గొల్లపూడిలోని హోల్‌సేల్ మంద్రుల దుకాణాల్లో డ్రగ్ కంట్రోలు అధికారులు చేపట్టిన తనిఖీల్లో పెద్దఎత్తున నకిలీ మందులు వెలుగు చూసినట్లు తెల్సింది. విజయవాడ నగరాన్ని కేంద్రంగా చేసుకుని రాష్ట్రంలోని ఇతర ముఖ్య పట్టణాలకు కూడా నకిలీ మందులు సరఫరా చేస్తూ ప్రజలను ఆర్థికంగానే గాక, ఆరోగ్యపరంగానూ దెబ్బ చేస్తున్నారు. వాసవీ ఫార్మా కాంప్లెక్స్‌లో జరిగిన తనిఖీల్లో లక్షల విలువ చేసే నకిలీ మందులను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. బ్రాండెడ్ పేరుతో నకిలీ మందులు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. హోల్‌సేల్ వ్యాపారులు బిల్లులు లేకుండా హైదరాబాద్ నుంచి ఈ ఔషధాలను తక్కువ ధరకు కొనుగోలు చేసి విజయవాడలో విక్రయిస్తున్నారు. ఇక్కడ నుంచి ఎంపిక చేసుకున్న ఇతర పట్టణాలకు సరఫరా చేస్తున్నారు. వీటిలో గుండె సంబంధిత వ్యాధులకు వినియోగించే ఔషధాలు శాంపిల్స్‌ను పరీక్షల నిమిత్తం అధికారులు ల్యాబ్స్‌కు పంపారు. వాటి ఫలితాలు ఇంకా రావాల్సి ఉంది. వచ్చిన తర్వాత వాటిలో ఎంత మేరకు నకిలీ ఉందనే తేలనుంది. అలాగే ఈ వ్యాపారం ఎంతకాలం నుంచి సాగుతోంది ? ఏఏ ప్రాంతాలకు ఇది విస్తరించింది ? ఈ నకిలీ వ్యాపార మార్కెట్ మూలాలు ఎక్కడున్నాయి ? తదితర అంశాలపై అధికారులు ఆరా తీస్తున్నారు. ల్యాబ్‌కి పంపిన మందుల ఫలితాలు వచ్చిన తర్వాత గాని బాధ్యులపై చర్యలు తీసుకోలేమని అధికారులు చెపుతున్నారు. ఇటీవల తెలంగాణ రాష్ట్రంలో కూడా భారీగా నకిలీ మందుల రాకెట్ బయటపడింది. అది ఏపీకి కూడా విస్తరించిందన్న సమాచారంతోనే అధికారులు విజయవాడతో పాటు రాష్ట్రంలోని కర్నూలు, గుంటూరు, నెల్లూరు సహా మరికొన్ని జిల్లాల్లో గుట్టుచప్పుడు కాకుండా తనిఖీలు చేపడుతున్నట్లు తెల్సింది. ప్రస్తుతం ఈ వ్యాపారంలో కీలకంగా వ్యవహరిస్తున్న ఇద్దరిపై డ్రగ్ కంట్రోల్ అధికారులు ఫిర్యాదు చేయడంతో విజయవాడ భవానీపురం పోలీసులు కేసు నమోదు చేశారు.

జీ20కి సర్వం సిద్ధం

నేడు బైడెన్‌తో మోదీ ద్వైపాక్షిక చర్చలు

మోదీ సర్కార్ ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న జీ20 సదస్సుకు దిల్లీ నగరం ముస్తాబైంది. ఈ సదస్సుకు భారత్ మొదటిసారిగా అధ్యక్షత వహిస్తోంది. దేశ రాజధాని దిల్లీలో ఈనెల 9,10 తేదీల్లో సదస్సు జరుగుతుంది.

2లో



భూమి, చంద్రుడి చిత్రాలు తీసిన ఆదిత్య -సెల్ఫీ కూడా

ఫొటోలు విడుదల చేసిన ఇస్రో

బెంగళూరు: సూర్యుడిపై పరిశోధనల కోసం భారత్ ప్రయోగించిన తొలి సౌర మిషన్ ఆదిత్య ఎల్-1 గమ్యం దిశగా దూసుకెళుతోంది. నిర్దేశిత కక్ష్యను చేరుకున్న తర్వాత రోజుకు 1,440 చిత్రాలను భూమికి పంపుతుందని తెలిపింది. మార్గమధ్యలో చంద్రుడు, భూమిని కలిపి ఫొటో తీసింది. అలాగే ఆదిత్య ఎల్-1 సెల్ఫీ కూడా తీసుకుంది. ఈ చిత్రాలను భారత అంతరిక్ష పరిశోధన కేంద్రం (ఇస్రో) గురువారం విడుదల చేసింది. బెంగళూరులోని కేంద్రకార్యాలయం నుంచి ఎక్స్ మాధ్యమంగా ఇస్రో పంచుకుంది. వీఈఎల్‌సీ (విజిబుల్ ఎమిషన్ లైన్ కొరొనోగ్రాఫ్), ఎస్‌యూఐటీ (సోలార్ అల్ట్రావైలెట్ ఇమేజర్) పరికరాలు ఆ చిత్రాల్లో కనిపిస్తున్నాయి. ఈనెల 4వ తేదీన ఆదిత్య ఎల్-1 కెమెరా ఈ ఫొటోలు క్లిక్‌మనిపించింది. వీఈఎల్‌సీ అన్నది ఆదిత్య ఎల్-1 ప్రాథమిక పేలోడ్ కాగా బెంగళూరుకు చెందిన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆస్ట్రోఫిజిక్స్ (ఐఐఏ) రూపొందించింది. అలాగే ఎస్‌యూఐటీ- పేలోడ్‌ను ఇంటర్-యూనివర్సిటీ సెంటర్ ఫర్ ఆస్ట్రోనమీ అండ్ ఆస్ట్రో ఫిజిక్స్ (ఐయూసీఏఏ), పూనే తయారు చేసింది. కాగా, భూమి నుంచి 15 లక్షల కిలోమీటర్ల దూరంలోని సూర్యుడి సమీపంలోని ఎల్-1 పాయింట్‌కు చేరేందుకు ఉపగ్రహానికి 125 రోజుల సమయం పట్టనుండటం విదితమే.

'భారత్'పై అభ్యర్థన వస్తే పరిగణిస్తాం: ఐరాస

2లో

తోరణాలతో అలంకరిస్తున్న తిరుపతి ప్రధాన కూడలి

సీపీఐ ర్యాలీ, సభకు తిరుపతి ముస్తాబు

తోరణాలు, కటౌట్లు, బ్యానర్లతో అలంకరణ

హాజరు కానున్న జాతీయ, రాష్ట్ర నాయకులు

రాష్ట్రాన్ని రక్షించండి...దేశాన్ని కాపాడండి అన్న నినాదంతో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక పాలన పై ప్రజా చైతన్యం కోసం, ప్రజా సమస్యలే ప్రధాన అజెండా గా సీపీఐ నిర్వహిస్తున్న బస్సుయాత్రకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు బ్రహ్మరథం పట్టారు. శుక్రవారం బస్సు యాత్ర ముగింపు ర్యాలీ, బహిరంగ సభ తిరుపతిలో జరగనుంది. ఈ ర్యాలీ, బహిరంగ సభకు అన్ని ఏర్పాట్లు చురుకుగా సాగుతున్నాయి.

8లో

ర్యాలీకి సిద్ధం చేస్తున్న సీపీఐ జెండాలు

జాబిల్లిపైకి జపాన్ 'మూన్ స్నైపర్'

హెచ్-11ఎ రాకెట్ ద్వారా నింగిలోకి

2లో

ఇదీ లోకం!

టమాటా ధర భారీ పతనం

- కేజీ మూడు రూపాయలే
- రైతుల ఆందోళన
- పట్టించుకోని ప్రభుత్వం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: టమాటా ధర మరింత పతనమైంది. నిన్నమొన్నటి దాకా అందుబాటులో లేని ధర ఇప్పుడు నేలకు దిగివచ్చింది. టమాటా రైతుకు కనీసం రవాణా చార్జీలు సైతం రావడం లేదు. దీంతో పంటను రైతులు రోడ్లపై పోస్తున్నారు. ఇటీవల వరకు టమాటా ధర మార్కెట్‌లో కిలో రూ.180 నుంచి రూ.200 వరకు పలికింది. ఇప్పుడు మూడు, నాలుగు రూపాయలకు పతనమైంది. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. పత్తికొండ మార్కెట్‌లో కిలో టమాటా ధర నాలుగు రూపాయలు నుంచి పది రూపాయల వరకు పలుకుతోంది. దాదాపు అన్ని మార్కెట్లలోనూ ఇలాగే ఉంది. టమాటాకు కనీస ధర లేకపోవడం, రవాణా చార్జీలు సైతం రాకపోవడంతో ఎగుమతి చేసేందుకు రైతులు వెనకడుగు వేస్తున్నారు. డోన్ జాతీయ రహదారిపై

- మిగతా 2 లో

టమాటా రైతును ఆదుకోండి

రామకృష్ణ డిమాండ్

పుంగనూరు మార్కెట్ యార్డు సందర్శించిన నేతలు

విశాలాంధ్ర -పుంగనూరు: గిట్టుబాటు ధర రాక టమాటా రైతులు అల్లాడుతున్నారని, ప్రభుత్వం జోక్యం చేసుకొని రైతులను ఆదుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. 15 కేజీల టమాటా బాక్స్ 100 రూపాయల లోపుగానే ఉందని, దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతురని రామకృష్ణ తెలిపారు. సీపీఐ బస్సుయాత్రలో భాగంగా రామకృష్ణ, ఇతర పార్టీ నాయకులు గురువారం పుంగనూరు మార్కెట్ యార్డ్‌ను సందర్శించారు. రైతులతో మాట్లాడి...వారి కష్టనష్టాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితి కారణంగా గత నెలలో దేశవ్యాప్తంగా టమాటా దిగుబడి పూర్తిగా తగ్గిందని, దీంతో టమాటా ధర అమాంతంగా పెరిగిందని, సామాన్యులు కొనలేని పరిస్థితి ఏర్పడిందని

- మిగతా 2 లో

వెళ్లిపోమంటే ఎక్కడికి వెళ్లాలి

ఇల్లు, పొలాలు కోల్పోయాం.. ఇది మా దేశం కాదా?

జీ20 సుందరీకరణతో పేదల అష్టకష్టాలు

న్యూదిల్లీ: భారత్ జీ20 శిఖరాగ్ర సదస్సును ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. ఇందుకోసం ప్రపంచ దేశాధినేతలు, విదేశీ ప్రతినిధులు హాజరు కానుండటంతో రాజధాని నగరాన్ని సుందరీకరించింది. జీ20 కోసం దిల్లీ ముస్తాబు కాగా తమకు మాత్రం గోరి కట్టినట్లు అవుతోందని పేదలు వాపోయారు. పరదాలు కట్టి పేదల బతుకులను దాచిపెట్టి పైపై మెరుగులు దిద్ది... దిల్లీని అందంగా తీర్చిదిద్ది ప్రపంచానికి 'అభివృద్ధి'ని చూపే ప్రయత్నాన్ని బీజేపీ ప్రభుత్వం చేస్తోంది. ఈనెల 9,10 తేదీల్లో జరగబోయే జీ20 సమావేశాల కోసం మార్చిలోనే పేదల ఇళ్ల కూల్చివేతలు మొదలయ్యాయి. 'సర్వం కోల్పోయాం. ఇన్నేళ్లుగా ఉంటున్న ఇల్లు పోయింది. సాగు చేసుకునే భూమి లేదు. వెళ్లిపోమంటే ఎక్కడికి వెళ్లాలి. ఎక్కడికైనా వెళ్లేంత డబ్బు మా దగ్గర ఉండివుంటే ఇలా ఫ్లైఓవర్ కింద తలదాచుకునే అవకాశం ఉండేదా? అని బాధితులు ప్రశ్నిస్తున్నారు. బేలా ఎస్టేట్ వద్ద ఫ్లైఓవర్ కింద, గీతా కాలనీ పుల్ బస్‌టాప్ వీధిలో తాత్కాలిక నివాసాలన్నింటిని సర్కార్ తొలగించింది. ఫ్లై ఓవర్ కింద ఉండేందుకు వీల్లేదని, ఆ ప్రాంతాన్ని ఖాళీ చేయాలని కొందరు పోలీసులు బుధవారం తమను బెదిరించారని కొందరు పేదలు వాపోయారు. వీరు ఇక్కడే ఉంటే అటుగా వెళ్లే విదేశీ ప్రతినిధులకు

- మిగతా 2 లో

ప్రపంచ వృద్ధికి కేంద్రం 'ఆసియాన్'

ఇండో-పసిఫిక్‌పై దృక్పథానికి భారత్ సంపూర్ణ మద్దతు

గ్లోబల్ సౌత్ గొంతు పెంచడం అందరికీ ప్రయోజనకారి

18వ తూర్పాసియా శిఖరాగ్ర సదస్సులో మోదీ

జకార్తా: ప్రపంచంలో క్లిష్ట పరిస్థితులు, అనిశ్చిత పరిస్థితులు నెలకొని ఉన్నాయని, ఉగ్రవాదం, భౌగోళిక రాజకీయ సంఘర్షణలు పెద్ద సవాళ్లుగా నిలిచాయని ఇండోనేసియా రాజధాని జకార్తలో జరిగిన ఆసియాన్-భారత్ 18వ తూర్పాసియా శిఖరాగ్ర సదస్సులో వక్తలు అన్నారు. సముద్రంలో సహకారం, ఆహార భద్రతపై రెండు ఉమ్మడి ప్రకటనలను సదస్సు ఆమోదించింది. సదస్సులో భారత ప్రధాని నరేంద్రమోదీ ప్రసంగిస్తూ ఆగ్నేయాసియా దేశాల మధ్య సహకారం ఉండాలని, స్వేచ్ఛాయుత ఇండో-పసిఫిక్ పురోగతి, 'గ్లోబల్ సౌత్' గొంతుకను పెంచడం అందరి ఉమ్మడి ప్రయోజనాల కోసమేనని ఉద్ఘాటించారు. ప్రపంచ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న 10 దేశాల ఆసియాన్ కూటమి... వృద్ధికి కేంద్రమని వర్ణించారు. భుజం, భుజం కలిపి పనిచేసేందుకు భారత్ సిద్ధమన్నారు. 21వ శతాబ్దం ఆసియాన్ దేశాల శకమని చెప్పారు. ఆసియాన్-భారత్ సదస్సుకు భారత్ పూర్తి మద్దతు ఇస్తుందన్నారు. ఆసియాన్-భారత్ కేంద్రీకృతానికి, ఇండో-పసిఫిక్‌పై ఆసియాన్ దృక్పథానికి భారతదేశం సంపూర్ణ మద్దతు ఇస్తుందని తెలిపారు. అంతర్జాతీయ చట్టం అన్ని దేశాలకు సమానంగా వర్తించేలా చేయాలని సూచించారు. ఆసియాలోని 'తైమూర్-లెస్టే'లో భారత రాయబార కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తామని మోదీ ప్రకటించారు. అన్ని దేశాల సార్వభౌమాధికారం, ప్రాదేశిక సమగ్రతను బలోపేతం చేయడానికి ఉమ్మడి కార్యాచరణ అవసరమని మోదీ పిలుపునిచ్చారు. ఉగ్రవాదం, ఉగ్రనిధి, సైబర్ తప్పుడు సమాచారం తదితర అంశాలపై ఉమ్మడి పోరుకు పిలుపుతో పాటు 12 అంశాల ప్రతిపాదనను గ్లోబల్ సౌత్ కోసం మోదీ చేశారు. గతేడాది సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత పెంచుకునేందుకు నిర్ణయించిన తర్వాత రెండు వర్గాల మధ్య ఇదే తొలి సదస్సు కాగా అంతర్జాతీయ సవాళ్లు, పర్యావరణ సమస్యల పరిష్కారానికి పరస్పరం సహకరించుకోవాలని మోదీ పిలుపునిచ్చారు. 12 అంశాల ప్రతిపాదనలో డిజిటల్ భవిష్యత్ కోసం ఆసియన్-భారత్ నిధి ఏర్పాటుకూ ప్రతిపాదన ఉంది. ఆసియాన్, తూర్పాసియా (ఎరియా) ఆర్థిక, పరిశోధన ఇన్‌స్టిట్యూట్‌కు మద్దతు పునరుద్ధరణనూ ప్రకటించారు. భారత్‌లో డబ్ల్యూహెచ్ఓ ద్వారా సంప్రదాయ ఔషధాల తయారీ, జనౌషధీ కేంద్రాల ద్వారా ప్రజలకు అందుబాటు ధరలకు నాణ్యమైన మందులు అందించగలిగిన భారత్ అనుభవాన్ని మోదీ పంచుకున్నారు. విపత్తులను తట్టుకొనే స్వీయసమృద్ధి సంస్థాగత కూటమిలో చేరాలని ఆసియాన్ దేశాలకు ఆయన పిలుపునిచ్చారు. భారత్ అధ్యక్షతన జీ20 సదస్సు జరగబోతున్న నేపథ్యంలో ఒక భూమి, ఒక కుటుంబం, ఒకే భవిష్యత్' నినాదంతో వసుధైవ కుటుంబకం గురించీ మోదీ ప్రస్తావించారు. కాగా, ఆసియాన్ దేశాల్లో ఇండోనేసియా, మలేసియా, ఫిలిప్పీన్స్, సింగపూర్, థాయిలాండ్, బ్రూనే, లావోస్, మైన్మార్, కంబోడియా ఉన్నాయి.

'భారత్'పై అభ్యర్థన వస్తే పరిగణిస్తాం: ఐరాస

జెనీవా/జకార్తా: ఇండియా వర్సెస్ భారత్ వివాదం ఐక్యరాజ్య సమితికి చేరింది. భారతదేశం తన పేరును మార్చుకుంటున్నట్లు ప్రతిపాదన లేక అధికారిక అభ్యర్థనను పంపితే దానిని పరిగణిస్తామని ఐరాస అధికారి ఫర్హాన్ హక్ వెల్లడించారు. దేశాలు పేర్లు మార్చుకోవడం కొత్తేమీ కాదని, ఇటీవల టర్కీ పేరు మారిందని గుర్తుచేశారు. పేరు మార్పునకు సంబంధించి టర్కీ నుంచి అధికారిక అభ్యర్థన అందడంతో దానిని పరిగణనలోకి తీసుకున్నట్లు తెలిపారు. భవిష్యత్‌లో అలాంటి అభ్యర్థనలు వస్తే తప్పక పరిగణిస్తామని 'భారత్'నుద్దేశించి హక్ అన్నారు.

భారత్‌కు భద్రతామండలి శాశ్వత సభ్యత్వం!

ఐరాస భద్రతా మండలిలో భారత్‌కు శాశ్వత సభ్యత్వం కోసం ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెర్రస్ బలంగా వాదిస్తున్నారని ఆయనకు అధికార ప్రతినిధి స్టెఫనీ దుజారిక్ వెల్లడించారు. మనం ఉంటున్న ప్రపంచాన్ని ప్రతిబింబించేలా భద్రతా మండలిలో సంస్కరణలు జరగాలని గుటెర్రస్ నొక్కి చెప్పినట్లు తెలిపారు. జకార్తలో ఆసియాన్ శిఖరాగ్ర సదస్సు జరుగుతున్న క్రమంలో దుజారిక్ గురువారం మీడియాతో మాట్లాడారు. ఐరాస భద్రతా మండలిలో సంస్కరణలు, భద్రతా మండలిలో భారత్‌కు శాశ్వత సభ్యత్వం విషయంలో గుటెర్రస్ పట్టుదలగా ఉన్నట్లు చెప్పారు. భౌగోళిక, అభివృద్ధి వైవిధ్యతకు అద్దంపట్టేలా భద్రతా మండలి ఉండాలన్నది ఆయన వాదనగా తెలిపారు. ఇదిలావుంటే ఐరాసలో భారత్ శాశ్వత ప్రతినిధి రుచిరా కంబోజ్ స్పందిస్తూ అభివృద్ధి చెందుతున్న దేశాల గళం వినిపించేలా, ప్రాతినిధ్యం లేని ప్రాంతాలు (ఆఫ్రికా, లాటిన్ అమెరికా, ఆసియా-పసిఫిక్)కు స్థానం కల్పించేలా భద్రతా మండలి ఉండాలని అన్నారు.

భద్రతా మండలి పనితీరులో పూర్తిస్థాయిలో మార్పును భారత్ కోరకుంటుందోని తెలిపారు. పనివిధానాల్లో స్వల్పంగా మార్చితే ఎలాంటి ఫలితం ఉండబోదన్న అభిప్రాయాన్ని కంబోజ్ వ్యక్తంచేశారు.

జాబిల్లిపైకి జపాన్ 'మూన్ స్నైపర్'

హెచ్-11ఎ రాకెట్ ద్వారా నింగిలోకి

ప్రయోగం విజయవంతం



టోక్యో: భారత్ చంద్రయాన్-3 మిషన్ విజయం తర్వాత జాబిల్లిపైకి చేరుకునేందుకు ప్రపంచ దేశాలు పోటీ పడుతున్నాయి. ఇదే క్రమంలో జపాన్ కూడా చంద్రుడిపై దిగిన ఐదవ దేశంగా నిలవాలని ఆకాంక్షిస్తోంది. దేశీయ పరిజ్ఞానంతో రూపొందిన చంద్రుడిపై పరిశోధన మిషన్‌కు గురువారం శ్రీకారం చుట్టింది. హెచ్-11ఎ రాకెట్ ద్వారా 'మూన్ స్నైపర్' లూనార్ లాండర్ స్లిమ్‌ను అంతరిక్షంలోకి పంపింది. దక్షిణ జపాన్, తనేగషిమా అంతరిక్ష కేంద్రం నుంచి జపాన్ ఎయిరోస్పేస్ ఎక్స్‌ప్లోరేషన్ ఏజెన్సీ (జాక్సా) అధ్వర్యంలో ప్రయోగం విజయవంతంగా జరిగింది. స్మార్ట్ ల్యాండర్ ఫర్ ఇన్వెస్టిగేటిగ్ మూన్ (స్లిమ్) నింగిలోకి దూసుకెళ్లింది. ఈ ప్రయోగం గత నెలల్లోనే జరగాల్సి ఉండగా వాతావరణం అనుకూలించని కారణంగా మూడుసార్లు వాయిదా పడింది. జాబిల్లి ఉపరితలంపై నిర్దేశిత ప్రాంతంలో 100 మీటర్ల లోపు స్లిమ్‌ను దింపాలని జపాన్ లక్ష్యంగా పెట్టుకుంది. 100 మిలియన్ దాలర్లతో ఈ మిషన్‌ను చేపట్టింది. వచ్చే ఏడాది ఫిబ్రవరి నాటికి చంద్రుడి ఉపరితలాన్ని తమ ఉపగ్రహం చేరుకుంటుందని అంచనా వేసింది. ఎక్కడ అవకాశం ఉంటే అక్కడ దిగడం కాకుండా కోరుకున్న స్థలంలోనే స్లిమ్‌ను దింపాలన్నదే తమ లక్ష్యమని జాక్సా అధ్యక్షుడు హిరోషి యమాక్వా వెల్లడించారు. ప్రయోగం జరిగిన కొన్ని గంటల తర్వాత స్లిమ్ నుంచి సిగ్నల్స్ అందాయని, ఉపగ్రహం పనితీరు సాధారణంగా ఉందని జాక్సా వెల్లడించింది.

టమాటా రైతును ఆదుకోండి

(మొదటిపేజీ తరువాయి)

చెప్పారు. ధరలు పెరిగినప్పుడు గగ్గోలు పెట్టిన రాజకీయ పార్టీలు, మీడియా...ఇప్పుడు ధర పడిపోయి...రైతులు తీవ్రంగా నష్టపోతుంటే ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. రైతులు రూ.3 లక్షలు ఖర్చు పెడితే లక్ష రూపాయలు రావడం లేదని తెలిపారు. కనీస మద్దతు ధర కిలోకు రూ.20 ఉంటే తప్ప రైతాంగం బతకలేదని చెప్పారు. రైతు ప్రభుత్వంగా చెప్పుకునే ముఖ్యమంత్రి సత్వరం జోక్యం చేసుకుని ధరల స్థిరీకరణ నిధి నుండి నిధులు కేటాయించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

బస్సుయాత్రకు సీపీఐ పుంగనూరు నగర కమిటీ భగత్‌సింగ్ కాలనీలో స్వాగతం పలికింది. నూతనంగా నిర్మిస్తున్న అయ్యలరాజ్ భవన్ వద్ద స్థానికుల సమస్యలను నాయకులు అడిగి తెలుసుకున్నారు. హమాలీ కార్మికులకు ఇంటి స్థలాల కోసం ఉద్యమించేందుకు సన్నద్ధం కావాలని స్థానిక నేతలకు దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో సీపీఐ సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి, కార్యదర్శివర్గ సభ్యులు జి.ఈశ్వరయ్య, డి.జగదీశ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె.రామాంజనేయులు, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జయలక్ష్మి, దుర్గా భవాని, మహిళా నేత విమల, ఏఐఎస్ఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జాన్సన్ బాబు, శివారెడ్డి, ఏఐవైఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పరుచూరి రాజేంద్ర, నక్కి లెనిన్‌బాబు, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రనాయక్, పెంచలయ్య, రాష్ట్ర కోశాధికారి ఆర్.పిచ్చయ్య, జనసేవాదళ్ ఇన్‌చార్జ్ మురళీకృష్ణ, నాయకులు గుర్రప్ప, నరసింహులు, మహేశ్, కృష్ణప్ప సాంబశివ, టి.జనార్దన్, ఎర్రమ్మూర్తి, వెంకటేశ్, మున్నా, మోహన్, కృష్ణ, రెడ్డి, రత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

టమాటా ధర భారీ పతనం

(మొదటిపేజీ తరువాయి)

ఒక రైతు టమాటాను పారపోశారు. ఆ టమాటాలను పశువులు తిన్నాయి. నంద్యాల జిల్లాలోనూ టమాటా ధర తగ్గింది. అక్కడ కిలో టమాటా ధర మూడు రూపాయలుగా ఉంది. చిత్తూరు తదితర ప్రాంతాల్లోనూ ధరలు తగ్గుతున్నాయి. మొన్నటి వరకు టమాటా కోసం రైతు బజార్ల దగ్గర వినియోగదారులు బారులు తీరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కౌంటర్ల ద్వారా టమాటా విక్రయాలు చేపట్టింది. ధరలు తగ్గడంతో వాటిని ప్రభుత్వం తొలగించింది. రైతుల నుంచి మూడు లేదా నాలుగు రూపాయలకు కొనుగోలు చేసినప్పటికీ వినియోగదారుడి చేతికి వచ్చే సరికి కిలో రూ.30 పలుకుతుంది.

భారీ వర్షాల ప్రభావం

భారీ వర్షాలు, సరఫరా పెరగడంతో టమాటా ధరలు భారీగా తగ్గాయి. తెలంగాణలో పడుతున్న భారీ వర్షాలతోనే ఏపీలో టమాటా ధర తగ్గుముఖం పట్టినట్లుగా తెలుస్తోంది. ఈ వర్షాల ప్రభావంతో హైదరాబాద్ పరిసర ప్రాంతాలకు టమాటా సరఫరా చేయడం రైతులకు ఇబ్బందిగా మారింది. రవాణా చార్జీలు భారీగా పెరగడంతో కనీస ఖర్చులు వచ్చే పరిస్థితి లేదు. దీంతో టమాటా ఎగుమతికి రైతులు ఆసక్తి చూపడం లేదు. డబ్బులు వెచ్చించి పండించిన పంటకు తగిన ధర రాకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆర్థికంగా చితికిపోతున్న రైతులను తక్షణమే ప్రభుత్వం ఆదుకోవాల్సిన అవసరం ఉంది.

చంద్రబాబును అరెస్టు చేయాలి

ఎంపీ నందిగం సురేశ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అమరావతి రాజధాని పేరిట రెండు కాంట్రాక్ట్ సంస్థల నుంచి చంద్రబాబు, లోకేశ్ కు రూ.118 కోట్ల ముడుపులు ముట్టినట్లు కేంద్ర ఐటీశాఖ నోటీసులు జారీచేసిందని, ఈ విషయంపై తక్షణమే చంద్రబాబును అరెస్ట్ చేసి విచారించాలని ఎంపీ నందిగం సురేశ్ డిమాండ్ చేశారు. ఐటీ నోటీసులకు సరైన సమాధానం చెప్పకుండా, డొంక తిరుగుడు వాదనలు చేస్తూ... చంద్రబాబు దొంగలా తప్పించుకు తిరుగుతున్నారని దుయ్యబట్టారు. తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... చంద్రబాబుకు ఐటీశాఖ జారీచేసిన నోటీసులపై జరుగుతున్న పరిణామాల్ని ప్రజలంతా గమనిస్తూనే ఉన్నారన్నారు. చంద్రబాబుకు తన భవిష్యత్ కళ్లకు కనిపిస్తుందేమో... అందుకే తనను రేపోమాపో అరెస్టు చేస్తారంటూ మాట్లాడారని సురేశ్ గుర్తుచేశారు. తప్పు చేసినవారిని చట్టం శిక్షించకమానదన్నారు. ఆ విషయం చంద్రబాబుకు సైతం తెలుసు కనుకే ఆయన భయపడుతున్నారన్నారు. రాజధాని ప్రాంతంగా అమరావతిని చెప్పుకుని... దాన్ని అడ్డంపెట్టుకుని ప్రజాసంపదను దోచుకోవడమే తప్ప ఇక్కడి ప్రజలపై చంద్రబాబుకు ప్రేమ లేదని విమర్శించారు. యువగళం పాదయాత్ర అంటూ మిడ్‌నైట్ వాక్ చేసే లోకేశ్, పాదయాత్రలో నడవలేకే ఉభయ గోదావరి జిల్లాల్లో అలజడులు సృష్టి స్తున్నారని, దానిని వైసీపీపై నెట్టేయడానికి చూస్తున్నారని ఆరోపించారు. వారెన్ని కుయుక్తులు పన్నినా, జగన్ ను మళ్లీ సీఎంగా చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.

ఆర్బీఐపై మోదీ సర్కార్ ఒత్తిడి నిజమే

(మొదటిపేజీ తరువాయి)

తీవ్రమైంది. ఆర్బీఐ నుంచి మరిన్ని డివిడెంట్లకు దొడ్డిదారి ప్రయత్నాలు చేసింది. పెట్టుబడుల ఉపసంహరణ లక్ష్యాలు నెరవేరని పక్షంలో ప్రభుత్వ సంపాదన, చేసే ఖర్చు మధ్య వ్యత్యాసం పెరిగింది. కేంద్రబ్యాంకు బ్యాలెన్స్‌షీట్‌పై దాడి చేసేందుకు అవకాశం ఉన్నప్పుడు ఎన్నికల సంవత్సరంలో ప్రచారదరణ పథకాలను కోత వేయడం ఎందుకు.... అని ఆచార్య రాశారు. 2019 జూన్‌లో ఆచార్య రాజీనామా చేశారు. డిప్యూటీ గవర్నర్‌గా మూడేళ్ల పదవీకాలం ముగియడానికి ఆరు నెలల ముందే బాధ్యతల నుంచి తప్పుకున్నారు. అంతకుముందు అంటే 2018, డిసెంబరులో ఆర్బీఐ గవర్నర్‌గా ఉర్జిత్ పటేల్ రాజీనామా చేశారు. ఆర్బీఐ, ప్రభుత్వం మధ్య విభేదాలున్న సమయంలో ఆయన వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేసినట్లు ఆయన తెలిపారు. మూడేళ్ల పదవీకాలం ముగియకుండా ఓ గవర్నర్ పదవిని వీడటం అరుదు. కేంద్రబ్యాంకు స్వాతంత్రను గౌరవించని ప్రభుత్వాలకు ఆర్థిక విపణుల దెబ్బ ఎప్పటికైనా తప్పబోదని, అప్పుడు రెగ్యులేటరీ వ్యవస్థ ప్రాధాన్యం వాటికి తెలిసి వస్తుందని స్మారకోపన్యాసం చేసినప్పుడు ఆచార్య వ్యాఖ్యానించారు. 2018లో పరిస్థితి సవాళ్లతో కూడుకున్నవని చెప్పడంలో సందేహం లేదన్నారు. 2008-09 నాటి ప్రపంచ ఆర్థిక సంక్షోభం అంతటి తీవ్రత లేదన్నారు. 2019 ఏప్రిల్-మేలో సార్వత్రిక ఎన్నికలు ఉండటంతో అప్పట్లో జరిగినదానికి ప్రాధాన్యత ఏర్పడిందని చెప్పారు. దొడ్డిదారి మొనటైజేషన్‌కు కొందరు ప్రభుత్వ మేధావులు రచించిన వ్యూహాల్లో భాగమే 2016 నవంబరులో జరిగిన పెద్దనోట్ల రద్దు అని తెలిపారు. ఈసారి మంత్రదండాన్ని కరెన్సీ నోట్లపై కాకుండా ఆర్బీఐ బ్యాలెన్స్‌షీట్‌పై ప్రయోగించారన్నారు. ప్రతిష్టంభనకు దారితీసిన ఘటనలనూ ప్రస్తావించారు. కేంద్రబ్యాంకుకు మార్గదర్శకాలు జారీ చేసేందుకు ఎన్నడూ వినియోగించని ఆర్బీఐ చట్టంలోని సెక్షన్ 7 అమలుపై చర్చలు జరిగాయని ఆచార్య తెలిపారు.స్వల్పకాలిక వ్యయాల కోసం కేంద్రబ్యాంకు బ్యాలెన్స్‌షీట్‌పై దాడికి పదేపదే ప్రతిపాదిస్తే ప్రతిఘటన ఎదురుకాకుండా ఉండదన్నారు. ఇటువంటి వ్యవస్థల విషయంలో ఏ ప్రభుత్వం కూడా ఇష్టారాజ్యంగా వ్యవహరించలేదని చెప్పారు. తాను ఈ ఉ పరిస్థితులను ప్రజల ముందర ఉంచడం... ఆర్బీఐ బ్యాలెన్స్ షీట్ల నుంచి ప్రభుత్వానికి భవిష్యత్‌లో బదిలీల కోసం కార్యాచరణ ప్రణాళిక రూపొందించేందుకు మాజీ గవర్నర్ బిమల్ జలన్ నేతృత్వ కమిటీ ఏర్పాటుకు దారితీసిందని చెప్పారు. ఆర్బీఐ బ్యాలెన్స్‌షీట్లపై దాడికి ప్రణాళిక రూపొందించిన ముఖ్యలను ప్రభుత్వం పక్కకు పెట్టిందన్నారు. 2018లో మాదిరి కాకుండా 2020లో మహమ్మారి వేళ భారీ మొత్తంలో బదిలీని సమర్థించుకునే అవకాశం ప్రభుత్వానికి లభించిందని ఆచార్య తెలిపారు. అసలు విషయం అందరికీ తెలియడంతో ఆ ఆలోచనను ఆచరణలో పెట్టే ప్రయత్నాన్ని రిజర్వు బ్యాంకు చేయలేదని పేర్కొన్నారు.

వెళ్లిపోమంటే ఎక్కడికి వెళ్లాలి

(మొదటిపేజీ తరువాయి)

కనిపిస్తారని, దేశం పరువుపోతుందని చెప్పారన్నారు. మేము కీటాకాలమా లేక అక్కరలేని వారమా? ఇది మా దేశం కాదా? వెళ్లిపోమంటే ఎక్కడి వెళ్లాలా? ఈ ప్రభుత్వానికి మా గురించి పట్టదా? అంటూ బాధితుల్లో ఒకరైన 62ఏళ్ల రామ్ ప్రశ్నించారు. 1900 నుంచి ఇదే ప్రాంతంలో తన కుటుంబం ఉంటోందని, సాగే తమకు ఆధారమని, ఇప్పుడు ఇళ్లు కూల్చేసి ఇక్కడ నుంచి వెళ్లిపోమంటే ఎక్కడకు వెళ్లాలని భావోద్వేగానికి లోనయ్యారు. బుల్డోజర్లు తెచ్చి మా నివాసాలన్నింటిని కూల్చివేశారని, తమ వస్తువులను గుంట్లో పూడ్చేశారని స్థానికులు వాపోయారు. జీ20 సమావేశాల వేళ పోలీసులు, దిల్లీ డెవలప్‌మెంట్ యంత్రాంగం (డీడీఏ) అధికారులు తరచూ ఆ ప్రాంతాలనూ సందర్శిస్తూ అక్కడ ఎవరు ఉండకుండా చర్యలు తీసుకుంటున్నట్లు స్థానికులు వాపోయారు. చుట్టుపక్కల ప్రాంతాల్లో ఉండేవారికి నీటి సరఫరా లేదు. ట్యాంకర్ ద్వారా నీటి సరఫరా జరుగుతుండగా, మరుగుదొడ్డి వసతి లేదు. దీని ప్రభావం మహిళలపై ఎక్కువగా ఉంటోంది. అపరిశుభ్ర పరిస్థితుల్లో జీవిస్తుండటంతో రోగాల బారిన పడే ప్రమాదం పెరిగింది. కానీ ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం అందడం లేదు. బేలా ఎస్టేట్, తుగ్లకాబాద్, కస్తూర్బానగర్ వంటి చోట్ల పెద్దఎత్తున కూల్చివేతలు జరిగాయి. బేలా ఎస్టేట్‌లో వాసులైతే బ్రిటన్ పాలకులకు లాగన్ చెల్లించిన స్లిప్పులను సైతం చూపుతూ ఇన్నేళ్లగా ఉండి ఇప్పుడు వెళ్లమంటే వెళ్లిపోయేందుకు మేము ఈ దేశ ప్రజలం కాదా అని కన్నీళ్లు కార్చారు. 2010-11లో కామన్‌వెల్త్ క్రీడలు జరిగినప్పుడు ఇలాంటి ప్రయత్నాలే జరిగాయని హీరాలాల్ గుర్తుచేశారు. అప్పట్లో ఎలాగో అలా బతికాం కానీ ఈ ప్రభుత్వం చాలా కర్కశంగా వ్యవహరిస్తోంది. పేదల గురించి ఏమాత్రం పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. తమకు ఎలాంటి సాయం లేదన్నారు. 2020లో అప్పటి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గుజరాత్ వెళ్లినప్పుడు మురికివాడలను పరదాలు, గోడల వెనుక దాచేశారు. ఈసారి నోయిడా సెక్టార్ 16 వద్ద అదేతరహా పరిస్థితి కనిపించింది. చిరు దుకాణాలనూ తొలగించేశారు.

ఏపీలో 'పాల్' ప్రాజెక్టు అమలుపై అమెరికా బృందం ప్రశంస

విశాలాంధ్ర-విజయవాడ: సెంట్రల్ స్క్వేర్ ఫౌండేషన్ అధ్వర్యంలో రాష్ట్రంలో పర్సనలైజ్డ్ అండ్ అడాప్టివ్ లెర్నింగ్ (పాల్) ప్రాజెక్టు అమలు చేస్తున్న పాఠశాలలను నోబెల్ అవార్డు గ్రహీత మైకేల్ క్రేమెర్‌తో పాటు చికాగోలోని డీఐఎల్ విశ్వవిద్యాలయానికి చెందిన ఎమిలీ క్యుపిటో బృందం పరిశీలించనుంది. ఈ బృందం సభ్యులు గురువారం సమగ్ర శిక్ష రాష్ట్ర కార్యాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేశ్‌కుమార్, సమగ్ర శిక్ష రాష్ట్ర పథక సంచాలకులు బి.శ్రీనివాసరావు.... ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విద్యాభివృద్ధికి చేపడుతున్న పథకాలు, కార్యక్రమాల గురించి వారికి వివరించారు. 'పాల్' ప్రాజెక్టు అమలులో ఆంధ్రప్రదేశ్ అగ్ర భాగాన నిలిచిందన్నారు. పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేష్ కుమార్ మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్ విద్యావ్యవస్థ అమలు తీరు గురించి చికాగో యూనివర్సిటీ బృందం పరిశోధించడం ఆనందకరమన్నారు. ఇలాంటి పరిశోధనలు రాష్ట్రంలో విద్యాభివృద్ధికి మరింత దోహదపడుతుందన్నారు. సమగ్ర శిక్ష రాష్ట్ర పథక సంచాలకులు బీ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లోని విద్యార్థుల అభ్యాస ఫలితాలను మెరుగుపరచడానికి పీఏఎల్ చొరవ అభినందనీయమన్నారు. ఈ బృందం మూడు రోజుల పాటు ఏలూరు జిల్లాలో వివిధ పాఠశాలలను సందర్శించనున్నట్లు చెప్పారు.

సామాన్యుడి కోసం కాంగ్రెస్ రావాలి

గిడుగు రుద్రరాజు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: సామాన్యుడి కోసం కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాల్సిన చారిత్రక అవసరముందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు స్పష్టం చేశారు. రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్ర ప్రారంభించి ఏడాది పూర్తయిన సందర్భంగా గురువారం విజయవాడలోని ఆంధ్రరత్న భవన్ నుంచి ధర్నాచౌక్ వరకు కాంగ్రెస్ నాయకులు ప్రదర్శన నిర్వహించారు. దీనికి సీడబ్ల్యూసీ సభ్యులు కె.రాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వందలాది మంది కార్యకర్తలు ఉత్సాహంగా తరలివచ్చారు. కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యాలయంతో పాటు ఏలూరు రోడ్డు పరిసర ప్రాంతాలన్నీ మూడు రంగుల జెండాలతో ముస్తాబయ్యాయి. ధర్నా చౌక్‌లో గిడుగు రుద్రరాజు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విద్వేష, విభజన రాజకీయాలకు పాల్పడుతోందని విమర్శించారు. బీజేపీకి వంతపాడుతున్న వైసీపీ, తెలుగుదేశం పార్టీ, జనసేన విధానాలను దుయ్యబట్టారు. కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు పాదయాత్ర చేసిన రాహుల్‌గాంధీ కోట్లాది ప్రజల గుండె చప్పుడు విన్నారని వివరించారు.

కాంగ్రెస్‌తోనే హోదా సాధ్యం: రాజు

ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కీలకమైన ప్రత్యేక హోదా, విశాఖ స్టీల్, పోలవరం వంటి సమస్యల పరిష్కారం కోసం కాంగ్రెస్ అధికారంలోకి రావాల్సిన అవసరముందని సీడబ్ల్యూసీ సభ్యులు కొప్పుల రాజు స్పష్టం చేశారు. రాహుల్ గాంధీ ఆలోచనలు, అభిప్రాయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కాంగ్రెస్ బలోపేతానికి పార్టీ శ్రేణులు కృషి చేయాలని కోరారు. విజయవాడ నగర కాంగ్రెస్ అధ్యక్షుడు నరహరిశెట్టి నరసింహారావు, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు బుర్రా కిరణ్, ఏఐసీసీ సభ్యులు ధనేకుల మురళి, నాయకులు మేడా సురేశ్, కొలనుకొండ శివాజీ, మీసాల రాజేశ్వరావు తదితర నాయకులు పాల్గొన్నారు.

ఇది రాజకీయ గిమ్మిక్కు

- సనాతన నెపంతో తప్పులు కప్పిపుచ్చుకునే యత్నంలో మోదీ
- ఉదయనిధి మాట్లాడింది అమానవీయ సూత్రాల గురించే: స్టాలిన్

చెన్నై: సనాతన ధర్మంలోని అమానవీయ సూత్రాల గురించి ఉదయనిధి స్టాలిన్ మాట్లాడారని, ఆయనను ప్రధాని లక్ష్యంగా చేసుకోవడం అన్యాయమని తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ అన్నారు. సనాతనలోని వివక్షపూరిత విధానాల గురించి కాదు దానిని అడ్డుపెట్టుకొని ప్రతిపక్ష కూమిలో విభజనలు సృష్టించడమే బీజేపీ ఉద్దేశమని స్పష్టమవుతోందన్నారు. ఇది రాజకీయ గిమ్మిక్కని అర్థం చేసుకోవడానికి రాజకీయ మేధావి కానక్కర్లేదన్నారు. సనాతన ధర్మానికి వ్యతిరేకంగా తన తనయుడు చేసిన వ్యాఖ్యలపై స్టాలిన్ గురువారం స్పందిస్తూ బీజేపీని దుయ్యబట్టారు. ప్రతిపక్ష మహాకూటమి 'ఇండియా'ని చీల్చే ప్రయత్నాన్ని బీజేపీ చేస్తోందన్నారు. అణచివేత సిద్ధాంతాలకు వ్యతిరేకంగా ఉదయనిధి వినిపించిన స్వరాన్ని బీజేపీ అనుకూల వర్గాలు తట్టుకోలేకపోతున్నాయని విమర్శించారు. మణిపూర్‌లో హింస, కాగ్ నివేదిక చూపిన రూ.7.50లక్షలకోట్ల అవినీతి గురించి ప్రధానిగానీ ఆయన మంత్రులుగానీ సమాధానం చెప్పలేదు కానీ సనాతనపై కేబినెట్ సమావేశాన్ని ఏర్పాటు చేశారని ఎద్దేవా చేశారు. ఇలాంటి నాయకులు నిజంగానే వెనుకబడిన వర్గాలకు, షెడ్యూల్డ్ కులాలకు, గిరిజనులకు రక్షణ కల్పించగలరా? మహిళా సాధికారతకు దోహదం కాగలరా? అని స్టాలిన్ ప్రశ్నించారు. సనాతన ధర్మాన్ని అనుసరించే వారి ఊచకోతకు పిలుపునిచ్చినట్లు ఉదయనిధిపై జరుగుతున్నది తప్పుడు ప్రచారమని స్పష్టంచేశారు. ఒక దేశం, ఒకే ఎన్నిక అమలుకు చర్యలు విపక్ష కూటమిని చూసి భయపడం వల్లేనని వ్యాఖ్యానించారు. రాజకీయ లబ్ధి కోసం బీజేపీ విభజన రాజకీయాలకు అనుభవజ్ఞులైన, నిబద్ధగల నాయకులు దూరంగా ఉంటారని, బీజేపీ నుంచి దేశాన్ని కాపాడేందే కసరత్తును తీవ్రతరం చేస్తారని స్టాలిన్ అన్నారు. 'అణచివేత సిద్ధాంతాలకు వ్యతిరేకంగా ఉదయనిధి మాట్లాడారు. వాటికి చరమగీతం పాడాలని సూచించారు. సనాతన ప్రబోధించే అమానవీయతను వ్యతిరేకించారు. ఎస్సీలు, ఎస్టీలు, గిరిజనులు, మహిళలపై వివక్ష చూపే సిద్ధాంతాలను దుయ్యబట్టారు. ఏ మతాన్ని లేక మతపరమైన మనోభావాలను దెబ్బతీయడం ఆయన ఉద్దేశం కాదు' అని డీఎంకే అధ్యక్షుడు తెలిపారు. బీజేపీ మాధ్యమాల్లో ఉదయనిధిపై ఉత్తరాదిన పెద్ద ఎత్తున అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. తమిళంలోగానీ ఆంగ్లంలోగానీ ఊచకోత అనే పదాన్ని ఉదయనిధి వాడలేదని స్టాలిన్ తెలిపారు. ఉదయనిధి స్పష్టతిచ్చిన తర్వాత కూడా కేంద్రమంత్రులు అమిత్‌షా, రాజ్‌నాథ్ సింగ్ తదితరులు తమ వ్యాఖ్యలను ఉపసంహరించుకోకపోగా తమిళ మంత్రిని ఖండిస్తూ అబద్ధపు ప్రచారాన్ని కొనసాగించారని విమర్శించారు. ఉదయనిధి వ్యాఖ్యలపై తగిన విధంగా స్పందించాలని మంత్రిమండలి సమావేశంలో ప్రధాని పిలుపునిచ్చినట్లు జాతీయ మీడియా చెబుతుండటం కలచివేసిందని స్టాలిన్ అన్నారు. 'ఏది నిజమో ఏది అబద్ధమో తెలుసుకునే వెసులుబాటు ప్రధానికి ఉంటుంది. కానీ ఆయన అవేమీ పట్టించుకోకుండా ఉదయనిధిని లక్ష్యంగా చేసుకోవడం అన్యాయం. ఇదంతా తప్పుడు ప్రచారమని ప్రధానికి తెలియదా లేక అంతా తెలిసే చేస్తున్నారా? అని స్టాలిన్ ప్రశ్నించారు. ఏవో వివాదాస్పద వ్యాఖ్యలు చేసినట్లు ఓ వీడియో ప్రచారం కావడంతో నిజమేమిటో తెలుసుకోకుండానే పార్లమెంటులోని కేబినెట్ సహచరి ఈవీ వేలుతో ప్రధాని ఇటీవల మాట్లాడటాన్ని బట్టి ఆయన ఇచ్చిన హామీలను అమలు చేయడంలో జరిగిన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు సనాతనను వాడుకుంటున్నారా అన్న అనుమానం కలుగుతోందని డీఎంకే అధ్యక్షుడు వ్యాఖ్యానించారు.

జీ20కి సర్వం సిద్ధం

న్యూదిల్లీ: మోదీ సర్కార్ ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న జీ20 సదస్సుకు దిల్లీ నగరం ముస్తాబైంది. ఈ సదస్సుకు భారత్ మొదటిసారిగా అధ్యక్షత వహిస్తోంది. దేశ రాజధాని దిల్లీలో ఈనెల 9,10 తేదీల్లో సదస్సు జరుగుతుంది. 20దేశాల అధినేతలు హాజరు కానున్నారు. కాగా అమెరికా అధ్యక్షుడు జో బైడెన్‌తో ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం ద్వైపాక్షిక చర్చలు జరపనున్నారు. ప్రగతి మైదాన్‌లోని భారత్ మండపంలో సమావేశాలు జరగనున్నాయి. ఆ ప్రాంగణంలో భారీ నటరాజ్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఆయా దేశాల జెండాలతో వేదిక ప్రాంగణం సర్వాంగ సుందరంగా తయారైంది. ఇప్పటికే కొన్ని దేశాల అధినేతలు దిల్లీ చేరుకున్నారు. వారికి ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది. సదస్సు సందర్భంగా దిల్లీ నగర వీధులు, ఉద్యానవనాల సుందరీకరణ జరిగింది. జీ20 సభ్యదేశాల జెండాలు, బ్యానర్లు, పోస్టర్లను భారీ ఎత్తున ఏర్పాటు చేశారు. చారిత్రక కట్టడాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. కుతుబ్ మినార్‌కు రంగురంగుల విద్యుదీకరణపై భిన్నస్వరాలు వినిపించాయి. అటు ట్రాఫిక్ ఆంక్షలనూ అమలు చేశారు. దిల్లీ నగరంలో హైఅలర్ట్ ప్రకటించారు. అంతటా డేగ కన్నుతో పహారా కాస్తున్నారు. 50వేల భద్రతా సిబ్బంది, కే9 జాగిలాలు, పోలీసు బలగాలను మోహరించారు. అతిథులు ఉండే హోటళ్లు, సమావేశాల వేదికల వద్ద కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాటు చేశారు. సైన్యం, వైమానిక దళం, నేషనల్ సెక్యూరిటీ గార్డ్ (ఎన్ఎస్‌జీ), కేంద్ర సాయుధ పోలీసు దళాల (సీఏపీఎఫ్) సహకారాన్ని దిల్లీ పోలీసులు తీసుకుంటున్నారు.

వక్ఫ్ బోర్డ్ డైరెక్టర్ ఎన్నికల బరిలో ముగ్గురు

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): రాష్ట్ర వక్ఫ్ బోర్డ్‌లో ముతావల్లి కోటా డైరెక్టర్ పదవికి ఎన్నికల రేసులో ముగ్గురు మిగిలారు. ఈ నెల ఒకటి నుంచి ఐదో తేదీ వరకు నామినేషన్లు స్వీకరించగా, ఐదుగురు అభ్యర్థులు ఏడు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. గురువారం నామినేషన్ల ఉపసంహరణకు గడువు ముగిసింది. నామినేషన్ల స్క్రూటినీ అనంతరం ఎన్నికల బరిలో అనంతపురానికి చెందిన కేఎం షకీల్ షఫీ, గుంటూరు జిల్లా మంగళగిరికి చెందిన షేక్ అక్రమ్, విజయవాడకు చెందిన షేక్ ఖాజా ఉన్నారు. ఈ నెల 9వ తేదీన విజయవాడ వన్‌టౌన్ పంజా సెంటర్ లోని ముసాఫిర్ ఖానాలో ఎన్నికలు నిర్వహిస్తారు. అదే రోజు సాయంత్రం ఓట్లను లెక్కించి విజేతను ప్రకటిస్తారు.

సంపద సృష్టి టీడీపీకే సాధ్యం

గుత్తి బహిరంగ సభలో చంద్రబాబు

విశాలాంధ్ర-గుంతకల్లు: సైకో జగన్‌కు పోలీసుల అండ, ధన బలం ఉండొచ్చు... వాటి కంటే మిన్నగా ప్రజాబలం తన సొంతమని టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు చెప్పారు. సంపద సృష్టించడం టీడీపీకే సాధ్యమన్నారు. 'బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారంటీ' కార్యక్రమంలో భాగంగా అనంతపురం జిల్లా గుత్తిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభకు టీడీపీ శ్రేణులు, ప్రజలు భారీగా తరలివచ్చారు. చంద్రబాబు మాట్లాడుతూ పోరాటం తన కోసం కాదని, రాష్ట్రాన్ని కాపాడుకోవడం కోసమేనన్నారు. చేయి చేయి కలుపుదాం.. రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకుందామని ప్రజలకు పిలుపునిచ్చారు. ఒక్క ఛాన్స్ అని మోసపోయాం.. అరాచక పాలన పోవాలి. ఇచ్చేది పది రూపాయలు.. దోచేది వంద రూపాయలు. ఇసుక ధరలపై ప్రశ్నిస్తే అరెస్టు చేసి జైలులో పెడుతున్నారు. ప్రజలు మాట్లాడే స్వేచ్ఛను హరించారు. యువగళం ప్రజాగళం.. ప్రజా ఉద్యమంగా మారింది. యువగళం వలంటీర్లపై పోలీసులు తప్పుడు కేసులు పెడుతున్నారు. అయినా, వెనక్కి తగ్గేది లేదు. పోరాటం కొనసాగిస్తాం. వ్యాపార కేంద్రమైన గుంతకల్లు పూర్వవైభవం కోల్పోయింది. గుత్తి చెరువుకు నీళ్లు కూడా ఇవ్వలేకపోయారు. టీడీపీ హయాంలో హంద్రీనీవా జలాలు తీసుకువచ్చాం. గొల్లపల్లి రిజర్వాయర్ నిర్మించి కియా పరిశ్రమ తెచ్చాం. పరిశ్రమ ద్వారా వేలాది మందికి ఉపాధి అవకాశాలు వచ్చాయి. సంపద సృష్టించే బాధ్యత.. పంచే బాధ్యత తనది. టెక్నాలజీ ద్వారా మీ జీవితాల్లో వెలుగు తీసుకొస్తా. ఇదే 'బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారంటీ' అని చంద్రబాబు వివరించారు.

ఏపీ జేఏసీ అమరావతి మహిళా విభాగం

నూతన కార్యవర్గం ఎన్నిక

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏపీ జేఏసీ అమరావతి అనుబంధంగా ఉన్న మహిళా విభాగాన్ని నూతన రాష్ట్ర కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రాష్ట్ర చైర్‌పర్సన్‌గా పారె లక్ష్మీ, (పశు సంవర్థక) అసోసియేటెడ్ చైర్‌పర్సన్‌గా సైకం శివకుమారిరెడ్డి (సమగ్ర శిక్ష), జనరల్ సెక్రటరీగా పొన్నూరు విజయలక్ష్మి (రెవెన్యూ), కోశాధికారిగా పావని (ఏపీ మున్సిపల్ విభాగం)ని ఎన్నికయ్యారు. వారితోపాటు వివిధ విభాగాల నుంచి రాష్ట్ర కో-చైర్మన్లుగాను, సెక్రటరీలుగాను నియమితులయ్యారు. గురువారం విజయవాడ సబ్ కలెక్టరేట్ ఆడిటోరియంలో ఏపీ జేఏసీ అమరావతి అనుబంధ మహిళా విభాగం రాష్ట్రకమిటీ ప్రమాణ స్వీకార సభ నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ హాజరయ్యారు. మహిళా ఉద్యోగులు నాయకత్వం లోకి రావాలని, స్వయంగా సమస్యల్ని పరిష్కరించుకునేందుకు పోరాటాలు చేసే స్థాయికి ఎదగాలని ఆమె సూచించారు. మహిళలు ధైర్యంగా ఉంటే ఏ సమస్యనైనా పరిష్కరించుకోవచ్చని చెప్పారు. మహిళా ఉద్యోగుల సమస్యల్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని భరోసా ఇచ్చారు. ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని విభాగాల్లో 50 శాతం పైబడి ఉన్న మహిళా ఉద్యోగులపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుని సమస్యలు పరిష్కారించాలని కోరారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి సహకారంతో అనేక శాఖల సమస్యల పరిష్కరించుకున్నామని చెప్పారు. ఈ సమావేశంలో ఏపీ జేఏసీ అమరావతి స్టేట్ సెక్రటరీ జనరల్ పలిశెట్టి దామోదరరావు, అసోషియేట్ చైర్మన్ టీవీ ఫణి పేర్రాజు, కోశాధికారి వీవీ మురళీకృష్ణ నాయుడు మాట్లాడుతూ... రాష్ట్రంలో ఏపీ జేఏసీ అమరావతి అనుబంధంగా రాష్ట్ర మహిళా విభాగం 2017 నుంచి కార్యకలాపాల్ని కొనసాగిస్తోందని గుర్తుచేశారు. మహిళల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తోందన్నారు. ఈ సమావేశానికి ఏపీ జేఏసీ అమరావతి, అనుబంధ సంఘాల నేతలు హాజరయ్యారు.

ఐరాస అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా

ఏపీలో సమన్వయ కేంద్రం

ప్రభుత్వ ప్రధాన కారదర్శి డా.కె.ఎస్.జవహర్ రెడ్డి

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఐక్యరాజ్య సమితి అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు సమన్వయ కేంద్రం ఏర్పాటు చేస్తున్నందున, ఆ పనులను వేగవంతం చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా॥ కేఎస్ జవహర్ రెడ్డి రాష్ట్ర ప్రణాళికా శాఖ కార్యదర్శి గిరిజా శంకర్‌ను ఆదేశించారు. గురువారం వెలగపూడిలోని ఆంధ్రప్రదేశ్ సచివాలయం సీఎస్ సమావేశ హాల్‌లో ప్రణాళికా శాఖ అధికారులతో ఆయన సమావేశమై రాష్ట్రంలో యూఎన్‌డీపీ, ఎస్‌డీజీ సమన్వయ కేంద్రం ఏర్పాటు పనుల ప్రగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2015 సెప్టెంబరులో ఐక్యరాజ్య సమితి సర్వసభ్య సమావేశంలో తీసుకున్న నిర్ణయం ప్రకారం రాష్ట్రంలో 17 అంశాల్లో సుస్థిర అభివృద్ధి, 169 నిర్దేశిత లక్ష్యాల సాధనకు సమన్వయ కేంద్రం ఏర్పాటు తప్పనిసరన్నారు. ప్రపంచంలోని బహుముఖ రంగాలలో పేదరికాన్ని రూపుమాపడానికి, విశ్వశ్రేయో సమృద్ధి కోసం సమానమైన, న్యాయమైన, సురక్షితమైన ప్రపంచాన్ని రూపొందించేందుకు 2030కల్లా ఈ సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించాల్సి ఉందన్నారు. ఇందుకై రాష్ట్రంలో సమన్వయ కేంద్రాన్ని సాధ్యమైనంత త్వరగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. యూఎన్‌డీపీ, సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించేందుకు హరియాణా, పంజాబ్, ఉత్తరాఖండ్, కర్నాటక, నాగాలాండ్, తమిళనాడు, ఉత్తర ప్రదేశ్ తదితర ఏడు రాష్ట్రాలు ఇప్పటికే యూఎన్‌డీపీ, ఎస్‌డీజీ సమన్వయ కేంద్రాలను ఏర్పాటు చేసుకున్నాయన్నారు. మన రాష్ట్రంలో కూడా ఈ కేంద్రాన్ని సాధ్యమైనంత త్వరగా ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టాలని ప్రణాళికా శాఖ అధికారులకు జవహర్‌రెడ్డి సూచించారు.

జగనన్న ఆరోగ్య సురక్షపై సమీక్ష

ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా రాష్ట్రాన్ని తీర్చిదిద్దాలనే లక్ష్యంతో వచ్చే నెల 15 నుంచి ప్రభుత్వం నిర్వహించనున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఎస్ జవహర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం వెలగపూడిలోని ఆంధ్రప్రదేశ్ సచివాలయం సీఎస్ సమావేశ మందిరంలో ఆరోగ్య, కుటుంబ సంక్షేమం, ఆరోగ్యశ్రీ ట్రస్టు, పాఠశాల విద్య, మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమం, పురపాలక, పట్టణాభివృద్ధి శాఖల అధికారులతో ఆయన సమావేశమై ఈ కార్యక్రమ నిర్వహణకు శాఖల వారీగా చేస్తున్న ముందస్తు ఏర్పాట్లను సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు సెప్టెంబరు 15 నుంచి వాలంటీర్ల ఇంటింటి ప్రచారం, 16 నుంచి ఏఎన్ఎం./సీహెచ్‌ఓలు ఇంటింటి సర్వే నిర్వహిస్తున్న నేపథ్యంలో వారికి అవసరమైన శిక్షణ, ప్రచార సామాగ్రిని, టెస్టింగ్ కిట్లను, ఔషధాలను, అవసరమైన ఇతర సామాగ్రిని ముందుగానే వారికి అందజేయాలని ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ప్రత్యేక సీఎస్ ఎం.టి.కృష్ణబాబుకు సూచించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ జె.నివాస్, ఆరోగ్యశ్రీ ట్రస్టు సీఈఓ హరేంద్రప్రసాద్, రాష్ట్ర విద్యా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాశ్, పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ కమిషనర్ కోటేశ్వరరావు, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జయలక్ష్మి, సెర్ప్ సీఈవో ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి సేద్యంలో

రాష్ట్రానికి మూడు అవార్డులు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఈ ఏడాది ఇంటర్నేషనల్ కాంపిటెన్స్ సెంటర్ ఫర్ ఆర్గానిక్ అగ్రికల్చర్, గ్రేటర్ నోయిడా దేశవ్యాప్తంగా నిర్వహించిన జాతీయ స్థాయి జైవిక్ ఇండియా పోటీల్లో ప్రథమ స్థానం పొందిన ఆంధ్ర ప్రదేశ్ కు గురువారం రాత్రి ఢిల్లీలో(నోయిడా) జరిగిన 'బయోఫాక్ ఇండియా న్యాచురల్స్ ఎక్స్ పో' లో అవార్డు ప్రదానం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున మంత్రి కాకాని గోవర్ధన రెడ్డి అవార్డు అందుకున్నారు. రాష్ట్రంలో భారీ స్థాయిలో 8 లక్షలకు పైగా రైతులు ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. దేశంలో ప్రభుత్వ సహకారంతో ఇంత పెద్ద ఎత్తున ప్రకృతి వ్యవసాయ కార్యక్రమం మరెక్కడా జరగడం లేదు. ఈ కారణంగా రాష్ట్ర ప్రభుత్వం... ఉత్తమ ప్రభుత్వాల కేటగిరీలో జైవిక్ జాతీయ స్థాయి అవార్డు కు ఎంపికైంది. ఉత్తమ ప్రకృతి వ్యవసాయ మహిళా కేటగిరీలో బాపట్ల జిల్లా యద్దనపూడి మండలం, చిమటావారి పాలెం గ్రామానికి చెందిన గనిపిశెట్టి పద్మజ జైవిక్ అవార్డు అందుకున్నారు. పద్మజ గత నాలుగేళ్లుగా ప్రకృతి వ్యవసాయం చేస్తూ రైతు సాధికార సంస్థచే ఇటీవలే మోడల్ మేకర్‌గా కూడా ఎంపికయ్యారు. గత ఏడాది (2022)కూడా జాతీయ స్థాయిలో 4 జైవిక్ అవార్డులను సొంతం చేసుకొన్న రైతు సాధికార సంస్థకు ఈ ఏడాది కూడా మూడు అవార్డులు రావడం విశేషం.

అగ్రిగోల్డ్ బాధితుల శంఖారావానికి రండి

నాదెండ్ల మనోహర్‌కు ముప్పాళ్ల ఆహ్వానం

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాటకు కట్టుబడి అగ్రిగోల్డ్ డిపాజిట్‌దారులకు పూర్తి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 15వ తేదీన విజయవాడలో భారీ ప్రదర్శన, జింఖానా గ్రౌండ్స్‌లో శంఖారావ దీక్ష నిర్వహించాలని అసోసియేషన్ నిర్ణయించిందని, ఈ సభకు జనసేన పార్టీ తరపున సంఘీభావం తెలియజేయాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి, అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు జనసేన రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్‌ను గురువారం తెనాలిలో కలిసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ముప్పాళ్ల మాట్లాడుతూ అగ్రిగోల్డ్ కంపెనీ చేసిన మోసపూరిత చర్యల వలన 19.52 లక్షల మంది ఆర్థికంగా నష్టపోయారని గుర్తుచేశారు. అసోసియేషన్ నిరంతరం సాగించిన ఉద్యమాల కారణంగా గత ప్రభుత్వ కాలంలో ఆత్మహత్యలకు గురైన142 మందికి రూ.5లక్షల చొప్పున ఎక్స్‌గ్రేసియా లభించిందని, ప్రస్తుత ప్రభుత్వం రూ.906 కోట్లను రూ.20వేల లోపు డిపాజిట్‌దారులకు రెండు విడతలుగా అందించిందన్నారు. రూ.20వేల లోపు మరో 3.50 లక్షల మందికి, రూ.20 వేల పైన 6.50 లక్షల మందికిపైగా డిపాజిట్లు రావలసి ఉందన్నారు. బాధితులకు చెల్లించాల్సిన మొత్తం ఇంకా రూ.3080 కోట్లు ఉంటుందన్నారు. ఆరు మాసాల్లో పూర్తి న్యాయం చేస్తామని, వడ్డీతో సహా చెల్లిస్తామని, కోర్టు విషయం తమ ప్రభుత్వం చూసుకుటుందని, కంపెనీ యాజమాన్యపు దుర్మార్గాల సంగతి తాను చూస్తానని, అసహజ మరణాలకు, ఆత్మహత్యలకు పాల్పడిన వారి కుటుంబాలకు తమ ప్రభుత్వం రూ.10లక్షల ఎక్స్‌గ్రేసియా చెల్లిస్తుందని సీఎం జగన్ హామీ ఇచ్చారని గుర్తుచేశారు. బాధితులు ఆర్థికంగా, మానసికంగా తీవ్ర ఆవేదనతో డిపాజిట్ల కోసం ఎదురు చూస్తున్నారని చెప్పారు. ముప్పాళ్ల వెంట ఏఐఎస్ఎఫ్ గుంటూరు జిల్లా అధ్యక్షుడు పాశం వెంకటేశ్, సీపీఐ తెనాలి పట్టణ కార్యదర్శి మద్దినేని కిరణ్‌బాబు, ఏఐవైఎఫ్ తెనాలి పట్టణ కార్యదర్శి బిల్లా రాజేశ్, ఏఐఎస్ఎఫ్ తెనాలి నాయకులు కోలా శేఖర్, కావేటి ఎస్వంత, శివ తదితరులు ఉన్నారు.

స్వచ్ఛ వాయు సర్వేక్షణ్‌లో గుంటూరుకు 3వ ర్యాంక్

- దక్షిణ భారతదేశంలో ఒక్క గుంటూరు నగరానికే గుర్తింపు
- భోపాల్‌లో జాతీయ అవార్డు అందుకున్న మేయర్, కమిషనర్

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: మినిస్ట్రీ ఆఫ్ ఎన్విరాన్‌మెంట్ ఫారెస్ట్ అండ్ క్లైమేట్ ఛేంజ్ అధ్వర్యంలో జాతీయ స్థాయిలో నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాం(ఎన్.క్యాప్) చేపట్టిన స్వచ్ఛ వాయు సర్వేక్షణ్‌లో గుంటూరు నగరానికి జాతీయ స్థాయిలో 3వ ర్యాంక్ దక్కింది. దక్షిణ భారతదేశంలో కేవలం గుంటూరు నగరానికే దక్కిన అవార్డును, రూ.25 లక్షల నగదు పురస్కారాన్ని, ప్రశంసా పత్రాన్ని కేంద్ర పర్యావరణ శాఖ మంత్రి భూపేంద్ర యాదవ్, మధ్యప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి శివరాజ్ చౌహాన్ చేతుల మీదుగా నగర మేయర్ కావటి శివనాగ మనోహర్‌నాయుడు, కమిషనర్ కీర్తి చేకూరి గురువారం అందుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వచ్ఛ వాయు సర్వేక్షణ్ పోటీల్లో జాతీయ స్థాయిలో 131 నగరాలు పోటీ పడ్డాయని, అందులో 10 లక్షలలోపు జనాభా కేటగిరిలో గుంటూరు నగరానికి 3వ ర్యాంక్ దక్కిందన్నారు. దక్షిణ భారతదేశంలో ఈ అవార్డు ఒక్క గుంటూరు నగరానికే దక్కడం గర్వకారణమన్నారు. జాతీయ కాలుష్య నియంత్రణ మండలి 131 నగరాల్లో స్వచ్ఛ వాయు సర్వేక్షణ్ అంశాల్లో పరిశీలించి 2023-24 ఆర్థిక సంవత్సరానికి ఉత్తమ నగరాలను సిఫార్సు చేసిందన్నారు. గతంలో కూడా సిటిజన్ పర్సెప్షన్ సర్వేలో రాష్ట్ర స్థాయిలో ఉత్తమ స్థానాన్ని గుంటూరు నగరపాలక సంస్థ సాధించిందని, త్వరలో పారిశుధ్య నిర్వహణపై స్థానిక ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో సంయుక్తంగా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తామని తెలిపారు. 10 లక్షల లోపు జనాభా కేటగిరిలో తొలి మూడు స్థానాల్లో నిలిచిన అమరావతి (మహారాష్ట్ర)కి రూ.75 లక్షలు, మోర్ధాబాద్(ఉత్తర ప్రదేశ్)కు రూ.50 లక్షలు, గుంటూరు నగరానికి రూ.25 లక్షలు నగదు బహుమతులు అందాయని తెలిపారు. గుంటూరు నగరానికి జాతీయ స్థాయిలో ర్యాంక్ రావడంలో నగర ప్రజలు, ప్రజా ప్రతినిధులు, అధికారుల కృషి ఉందని, ఈ అవార్డు ద్వారా జాతీయ స్థాయిలో గుంటూరు ఖ్యాతి చాటడంలో భాగస్వాములైన ప్రతి ఒక్కరికి నగరపాలక సంస్థ తరపున ప్రత్యేక అభినందనలు తెలుపుతున్నామన్నారు.

లోకేశ్ పాదయాత్రకు అపూర్వ స్పందన

విశాలాంధ్ర-నరసాపురం: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ చేస్తోన్న యువగళం పాదయాత్ర బుధ, గురువారాలు నరసాపురం నియోజకవర్గంలో కొనసాగింది. లోకేశ్ పాదయాత్రకు అద్భుత స్పందన లభించింది. లోకేశ్‌కి మహిళలు కుంకుమ బొట్లు, హారతులు, పూలవర్షంతో ఆశీర్వదించారు. అమెరికా నుంచి కొవ్వలి రామ్మోహన్ నాయుడు హుటాహుటిన నరసాపురం చేరుకుని యువగళం పాదయాత్రలో లోకేశ్‌కి బాసటగా నిలిచారు. కొవ్వలి నాయుడు ఇంటి దగ్గర కుటుంబ సభ్యులతో కలిసి లోకేశ్ మెడలో భారీ గజమాలతో పాటు పూల వర్షం కురిపించారు. నర్సాపురం మండలం సీతారామపురం నుంచి గురువారం ఉదయం ప్రారంభమైన లోకేశ్ పాదయాత్ర మొగల్తూరు రోడ్డు మీదుగా లెప్రసీ హాస్పటల్ రోడ్డు, పట్టణంలోని రుస్తుంబాద జగన్నాథ స్వామి ఆలయం, ప్రభుత్వాసుపత్రి రోడ్డు, మిషన్ హైస్కూల్ రోడ్డు, పంజా సెంటర్, పాత బజార్, మెయిన్ రోడ్డు, అంబేడ్కర్ సెంటర్, పాలకొల్లు, చిట్టవరం వరకు కొనసాగింది. లోకేశ్‌ని మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు తండ్రి భుజంగరాయుడు కలిశారు. టీడీపీ సీనియర్ నాయకుడు కాగిత వెంకటేశ్వరరావు మహిళలతో కలిసి లోకేశ్‌కు పూలబాట ఏర్పాటు చేశారు. లేసు ఉత్పత్తులతో తయారు చేసిన భారీ గజమాలను మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు వేయగా యాపిల్స్‌తో తయారు చేయించిన భారీ గజమాలను టీడీపీ నరసాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి పొత్తూరి రామాంజనేయరాజు (రామరాజు) వేశారు. కార్యక్రమంలో ఎంపి షరీఫ్, మాజీమంత్రి కొల్లు రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

పాలకొల్లు మండలం సగం చెరువు గ్రామం నుండి యువగళం పాదయాత్ర సాయంత్రం 4 గంటలకు ప్రారంభమైంది. సగం చెరువు వద్ద రైతు విభాగం అధ్వర్యంలో కొబ్బరి మొక్కలతో భారీ దండను ఏర్పాటు చేశారు. శాసనసభ్యుడు నిమ్మల రామానాయుడు లోకేశ్‌కు స్వాగతం పలికారు. దిగమర్రు బైపాస్ మీదుగా చించినాడ వరకు పాదయాత్ర సాగింది. అల్లర్లు జరుగుతున్న నేపథ్యంలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. దిగమర్రు వద్ద బేడ బుడగ జంగాలతో లోకేశ్ మాట్లాడారు. పెదమామిడిపల్లి వద్ద గీత కార్మికులు తమ సమస్యలను లోకేశ్‌కి చెప్పుకున్నారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ మన ప్రభుత్వం అధికారంలోకి రాగానే గీత కార్మికులను ఆదుకుంటుందన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. పెద్దసంఖ్యలో టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు

నిబంధనలకు విరుద్ధంగా చిట్లు

ఏపీ సీఐడీ డీజీ సంజయ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: నిబంధనలకు విరుద్ధంగా మార్గదర్శి చిట్లు వేస్తోందని, ఆ సంస్థ మోసాలపై ప్రజలకు వాస్తవాలు తెలియాల్సి ఉందని ఏపీ సీఐడీ డీజీ ఎన్.సంజయ్ చెప్పారు. వెలగపూడి సచివాలయం పబ్లిసిటీ విభాగంలో గురువారం బాధితురాలు అన్నపూర్ణాదేవితో కలిసి సీఐడీ అధికారులు విలేకరుల సమావేశం నిర్వహించారు. డీజీ సంజయ్ మాట్లాడుతూ, ప్రజలు కోట్లలో డబ్బులు కడితే, వారి చేతికి వేలల్లోనే ముట్టిందన్నారు. కోటి రూపాయలకు పైగా పెద్ద మొత్తంలో చిట్లు వేసిన వారు 800 మంది ఉన్నట్లు తమ తనిఖీల్లో వెల్లడైందని వివరించారు. అసలు చిట్ దారులకు తెలియకుండా, వారి పేరునే నిబంధనలకు విరుద్ధంగా చిట్‌లు వేస్తున్నారని చెప్పారు. చిట్స్ నిబంధనల్ని ఆ సంస్థ పాటించడం లేదని విమర్శించారు. ఈ సంస్థ మోసాలపై ఐటీ, ఈడీలకు సమాచారం అంద జేసిన విషయాన్ని గుర్తుచేశారు. చిట్‌ల పేరుతో ఆర్థిక నేరం జరిగిందని, దానిని యాజమాన్యం కప్పిపుచ్చుకుంటోందని, వారివే వాస్తవాలనే ధోరణితో ఉండటం తగదన్నారు. తాము తనిఖీలకు వెళ్తుంటే ఇదే పనా?, వేరే పనిలేదా అంటూ ఎదురు ప్రశ్నిస్తున్నారని వ్యాఖ్యానించారు. బాధితురాలు అన్నపూర్ణదేవీ మాట్లాడుతూ తాను ఎనిమిదేళ్లుగా చిట్‌లు వేసి వేధింపులు ఎదుర్కొన్నానని, వారసత్వంగా సంక్రమించే ఆస్తుల్ని సైతం విక్రయించుకున్నానని ఆవేదన వ్యక్తం చేశారు. తన లాంటి వారి జీవితాలను నాశనం చేసిన యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరారు.

మత్స్యకారులను రక్షించిన విశాఖ కోస్ట్‌గార్డ్

విశాలాంధ్ర బ్యూరో- విశాఖపట్నం: చేపల వేట కోసం సముద్రంలోకి వెళ్లి... సముద్రం మధ్యలో చిక్కుకున్న తమిళనాడుకు చెందిన తొమ్మిది మంది మత్స్య కారులను విశాఖ కోస్ట్ గార్డ్స్ రక్షించారు. ఆగస్టు 24న తమిళనాడులోని కాసిమేడు నౌకాశ్రయం నుంచి బయలు దేరిన వారి బోటు (గణపతి పెరుమాళ్) విశాఖపట్నం పోర్టు వైపు వచ్చింది. అయితే, సముద్రం మధ్యలో ఉండగా తమిళనాడుకు చెందిన బోటులో సాంకేతిక సమస్యలు ఎదురవడంతో ఆపదలో చిక్కుకున్న మత్స్యకారులకు ఏం చేయాలో పాలుపోలేదు. అప్పటికే తమిళనాడు తీరానికి దూరంగా విశాఖ తీరాని దగ్గరగా ఉన్నామని అర్థం కావడంతో విశాఖలో ఉన్న కోస్ట్ గార్డుకు సహాయం కోరుతూ మత్స్యకారులు.. సమాచారం అందించారు. వెంటనే స్పందించిన విశాఖ కోస్ట్ గార్డ్స్ బోటును తీరానికి చేర్చేందుకు సహాయక చర్యలు ప్రారంభించారు. కోస్ట్ గార్డ్స్ సహాయక చర్యలతో తమిళనాడుకు చెందిన బోటు మత్స్యకారులను సురక్షితంగా ఒడ్డుకు చేరారు. నిలిచిపోయిన బోటులో 9 మంది మత్స్య కారులున్నట్లు అధికారులు పేర్కొన్నారు. కోస్ట్ గార్డ్ సకాలంలో స్పందించి తమకు సహాయం చేశారని మత్స్య కారులు తెలిపారు.

నోట్ల మార్పిడి కేసులో నిందితుల అరెస్ట్

విశాలాంధ్ర-నంద్యాల: రూ.500ల నోట్లకు బదులుగా రూ.2 వేల నోట్లు ఇస్తామని మోసం చేసిన కేసులో నిందితులను అరెస్టు చేసి రిమాండ్ కు పంపినట్లు డీఎస్పీ మహేశ్వర్ రెడ్డి తెలిపారు. గురువారం ఆయన నంద్యాలలోని తాలూకా అర్బన్ పోలీస్ స్టేషన్‌లో రూరల్ సీఐ ఎం.దస్తగిరి బాబుతో కలిసి విలేకర్ల సమావేశం నిర్వహించి కేసు వివరాలను వెల్లడించారు. నిందితులు టంకాల శోభన్ బాబు, చిన్నబాబుతో పాటు మరో ఆరుగురు నూనెపల్లికి చెందిన శ్రీనివాసరెడ్డి అతని స్నేహితులను ఐదుగురు వ్యక్తులు పరిచయం చేసుకొని రూ.2వేల నోట్లు రద్దవుతున్నాయని నమ్మబలికారు. తమ వద్ద రూ.2వేల నోట్లు ఎక్కువగా ఉన్నాయని, ఎవరైనా రూ.500 నోట్లు ఇస్తే వారికి 15శాతం కమీషన్ కలిపి రూ.2వేల నోట్లు ఇస్తామని చెప్పారు. భాధితులను రైతునగరం గ్రామం దగ్గరకు జులై 20వ తేదీన పిలిపించుకొని శ్రీనివాసరెడ్డి, అతని స్నేహితుల దగ్గర మొత్తం సూ.2 కోట్ల 20 లక్షల రూపాయలు తీసుకొని ఉడాయించారు. దీనిపై ఫిర్యాదు అందడంతో జులై 22 వ తేదీన నంద్యాల తాలూకా పోలీసు స్టేషన్లో కేసు నమోదు చేశామని డీఎస్పీ తెలిపారు. సదరు కేసుని ఛేదించే క్రమంలో సీఐలు దస్తగిరి బాబు, రవీంద్ర, ఎస్ఐలు రామ మోహన్ రెడ్డి, బాబు వారి సిబ్బంది చంద్ర శేఖర్, కె.కోటేశ్వర రావు, మద్దిలేటి, మధుసూదన్ రెడ్డి, కృష్ణమనాయుడులు కలిసి రెండు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి గుంతకల్, విశాఖ ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపట్టగా ఈ నెల 6 వ తేదీన నిందితులు టంకాల శోభన్ బాబు, కంచరణ చిన్నబాబులను విశాఖపట్టణంలోని మాధవధారా ప్రాంతంలోని మరో నిందితుడి ఇంటి వద్ద అరెస్టు చేసినట్లు వెల్లడించారు. వారి వద్ద నుంచి రూ.70 లక్షల మేర ఉన్న రూ. 500ల నోట్లను స్వాధీన పరుచుకుని బాధితులకు రికవరీ చేసినట్లు తెలిపారు. ఈ కేసులో ఇంకా ఆరుగురు నిందితులను పట్టుకోవాల్సి ఉందని చెప్పారు. ఈ కేసులో ప్రతిభ కనబరచిన సీఐలు, దస్తగిరిబాబు, రవీంద్ర, ఎస్ఐలు రామమోహన్ రెడ్డి, బాబు, సిబ్బంది చంద్ర శేఖర్, కె. కోటేశ్వర రావు ఎంసీ మద్దిలేటి, మధుసూదన్ రెడ్డి, కృష్ణమ నాయుడులను జిల్లా ఎస్పీ అభినందించినట్లు ఆయన తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పరిచయం లేని వ్యక్తులు వచ్చి చెప్పే మాయ మాటలు నమ్మొద్దని డీఎస్పీ మహేశ్వర్ రెడ్డి సూచించారు.

సంపాదకీయం

అఖండ భారత్ కల

మన ఇరుగుపొరుగున ఉన్న పాకిస్థాన్, బంగ్లాదేశ్, నేపాల్, శ్రీలంక, టిబెట్, మైన్మార్, మాల్దీవులు, బంగ్లాదేశ్, భూటాన్, ఇండియాలను కలిపి అఖండ భారత్ లేదా అఖండ హిందుస్థాన్ ఏర్పాటు చేయాలని ఆర్ఎస్ఎస్‌ను స్థాపించిననాటి నుంచి కలలుకంటున్నారు. ఆ తర్వాత హిందుస్థాన్, హిందు రాష్ట్రగా ఇండియాను మార్చివేయాలని దాదాపు శతాబ్దికాలంగా కలవరిస్తున్నారు. కొందరు వ్యక్తులుగా స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నారు గానీ ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు, నాయకులు బ్రిటీష్ వలసపాలకులకు అనుగుణంగా నడచుకున్నారు. ఆర్ఎస్ఎస్ రాజకీయ విభాగంగా జనసంఘ్‌ను ఏర్పాటుచేశారు. ఇది ఒక రాజకీయపార్టీగా ఎదగలేదు. హిందూమత భావజాలాన్ని విస్తరించడంపై కేంద్రీకరించారు. గాంధీ సోషలిజం తమ భావజాలం అంటూ కొంతకాలం ప్రచారం చేసుకున్నారు. అనంతరం బీజేపీగా అవతరించి, క్రమంగా మిత, మత భావజాలంతో హిందువులను ఆకట్టుకొని, పరిపాలనకు సంబంధించి వాస్తవ విరుద్ధమైన విషయాలను ఏనాడు లేని స్థాయిలో ప్రచారం చేయడం ద్వారా బీజేపీ కేంద్రంలో అధికారంలోకి వచ్చింది. నరేంద్ర మోదీ ప్రధానమంత్రిగా అధికారం చేపట్టడానికి ముందు ఏబీ వాజ్‌పేయి ప్రధానమంత్రిగా ఎన్‌డీఏ ప్రభుత్వం ఏర్పడింది. అప్పుడే ఆర్ఎస్ఎస్ వాజ్‌పేయి ద్వారా తమ లక్ష్యాలు నెరవేర్చుకునేందుకు దుందుడుకుగా వ్యవహరించలేకపోయింది. మోదీ తొమ్మిదేళ్ల పాలనాకాలంలో ఆర్ఎస్ఎస్ విజృంభించింది. ఆ కాలంలో మత విభజనకు అన్నిరకాల చర్యలను మోదీ ప్రభుత్వ చేపట్టి ఆర్ఎస్ఎస్ 'లక్ష్యాలను' నెరవేర్చడానికి అనేక వ్యూహాలు పన్ని అమలు చేస్తున్నారు. మోదీ పాలనపై ప్రజలలో తీవ్ర వ్యతిరేకత, అసంతృప్తి ఏర్పడింది. మోదీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని ధ్వంసం చేసేందుకు పూనుకున్న తరుణంలో 28 ప్రతిపక్షాలు కలిసి 'ఇండియా' కూటమిగా ఏర్పడి లోకసభకు 2024లో జరగనున్న ఎన్నికల్లో మోదీ ప్రభుత్వాన్ని ఓడించి ప్రత్యామ్నాయ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించాయి. ఈ దశలో అఖండ భారత్‌ను ఏర్పాటు చేస్తామని ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్‌భగవత్ ప్రకటించారు. ప్రస్తుత యువతరం వృద్ధులయ్యేనాటికి అఖండ భారత్ ఏర్పాటు అవుతుందని అన్నారు. 1947లో వేరుగా వెళ్లిన వారంతా ఆనాడు తాము తప్పుచేశామని అనుకుంటున్నారని చెప్పారు. అంతేకాదు... ఇండియాను భారత్‌గానే గుర్తించాలని, ఇండియా పదాన్ని తాను ఇష్టపడనని కూడా అన్నారు. రాజ్యాంగంలోనూ 'ఇండియా దటీజ్ భారత్' అని ఉంది. భారత్ అనే పదం చాలకాలంగా వాడుకలోనే ఉంది. అంతర్జాతీయంగా భారత్‌కు గుర్తింపు ఉంది. 2023 చివరి నాటికి ఐదు రాష్ట్రాలకు ఎన్నికలు జరగనున్నాయి. రానున్న ఎన్నికల కోసం ప్రతిపక్షాలు కలిసి ఇండియా కూటమిని ఏర్పాటు చేసిన నాటినుంచి ఆందోళన చెందుతున్న మోదీ ప్రజల దృష్టి మళ్లించేందుకు అనేక అస్త్రాలను ప్రయోగిస్తున్నారు. అయితే ఇండియాను భారత్‌గా మార్చినప్పటికీ బీజేపీకి పెద్దగా ప్రయోజనం కలిగే అవకాశాలు లేవని పరిశీలకుల అంచనా. అత్యధిక రాష్ట్రాల్లో ఇండియా కూటమి పార్టీలు బలంగా ఉన్నాయి. జాత్యహంకార భావజాలం గల ఆర్ఎస్ఎస్...ఇండియా పదాన్ని సహించే పరిస్థితిలో లేదు. ఇండియాను భారత్‌గా మారిస్తే 'మోదీ కీర్తి' శాశ్వతంగా ఉంటుందని సంఘ్‌పరివార్ రెచ్చగొడుతోంది.

ఇండియాను భారత్‌గా మార్చేందుకుగాను గతంలో రెండుసార్లు సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. ఢిల్లీలో నివసిస్తున్న వాణిజ్యవేత్త 2020లో రాజ్యాంగంలోని ఆర్టికల్-1ని సవరించాలని పిటిషన్‌లో కోరారు. ఈ ఆర్టికల్‌లో 'ఇండియా దటీజ్ భారత్ షల్ బి యూనియన్ ఆఫ్ స్టేట్స్' అని ఉంటుంది. గ్రీకు పదం ఇండిక నుంచి ఇండియా పదం వచ్చిందని, ఇండియా పదం మనదేశ సంస్కృతిని, సంప్రదాయాన్ని ప్రతిబింబించడం లేదని పిటిషన్‌దారు వాదించారు. పిటిషన్‌దారు బహుశా ఆర్ఎస్ఎస్ సంబంధంకలిగి ఉండవచ్చు. స్వాతంత్ర్యం, రాజ్యాంగం పట్ల విశ్వాసం ఉన్నవాళ్ల ఇలాంటి పిటిషన్ దాఖలుచేసే అవకాశం లేదు. ఈ పిటిషన్‌ను నాటి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి శరద్‌బోబ్డే తిరస్కరించారు. రాజ్యాంగంలో 'భారత్, ఇండియా అనే రెండుపేర్లు ఉన్నాయి. ఇప్పటికీ భారత్ అని పిలుస్తున్నారు కదా' అని వ్యాఖ్యానించారు. అంతకుముందు 2016లో టిఎస్ ఠాకూర్ సుప్రీంకోర్టు ప్రధానన్యాయమూర్తి ధర్మాసనం తమ ముందుకువచ్చిన పిటిషన్‌ను తిరస్కరించింది. అంతేకాదు, పౌరుడు తనదేశాన్ని ఎలా పిలవాలన్న విషయాన్ని ఈ ధర్మాసనం నిర్ణయించలేదని స్పష్టంచేసింది. అయితే కనీసం లోకసభలో చర్చించి అందరి ఆమోదం పొందకుండానే నిరంకుశంగా నిర్ణయం తీసుకుని ప్రపంచదేశాలకు భారత్‌గా గుర్తించాలని సమాచారం పంపారు. 20 దేశాల శిఖరాగ్ర సభ ఢిల్లీలో జరగనున్న సందర్భంగా విదేశాల నేతలకు పంపిన ఆహ్వానంలో భారత్ ఆహ్వానిస్తున్నట్లు మోదీ ప్రభుత్వం పేర్కొన్నది. ఈ నెల 18 నుంచి 22వ తేదీ వరకు ప్రత్యేక పార్లమెంటు సమావేశాలు జరుగుతాయని ఆకస్మికంగా ప్రకటించారు. కనీసం అజెండాను తెలియజేయలేదు. బహుశా 'రిపబ్లిక్ ఆఫ్ ఇండియా'ను తొలగించడానికి సంబంధించి బిల్లును ప్రవేశపెట్టవచ్చు. మోదీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఏ నిర్ణయమైనా ఏకపక్షంగా తీసుకుంటూనే ఉన్నారు. అతి ముఖ్యమైన పెద్దనోట్ల రద్దు, కరోనా సమయంలో దేశవ్యాప్తంగా లాక్‌డౌన్, జీఎస్టీ అమలు, ప్రభుత్వరంగ సంస్థలను, ప్రభుత్వ బ్యాంకులను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టడం లాంటివి ఎవరితోనూ చర్చించకుండా ప్రకటించి నిరంకుశత్వబాటలో పయనిస్తున్నారు. ఆర్ఎస్ఎస్ అధినేత 'అఖండ భారత్' ఏర్పాటు ప్రకటన చేయడం మతవాదులను సంతృప్తి పరిచేందుకే కావచ్చు. ఎప్పుడో అనేక దేశాలు అఖండ భారత్‌గా ఉన్నాయన్న మాట నిజమేకావచ్చు. లేదా పుక్కిటి పురాణం కావచ్చు. ప్రపంచం ఎంతో మారిపోయింది. నేటి యువతరం అంతర్యుద్ధ వాతావరణాన్ని కోరుకోవడం లేదు. హిందూత్వం వేరు. హిందువులు వేరు అని తెలుసుకుంటున్నారు. అందువల్ల భగవత్‌గానీ, మోదీ, అమిత్‌షా గానీ అఖండ భారత్ ఏర్పాటును కలగనవలసిందే. వాస్తవవిరుద్ధమైన ఆలోచనను దేశప్రజలు అంగీకరించే పరిస్థితి లేదు.

మతమా- శాస్త్రమా

మతం కావాలా, శాస్త్రం కావాలా తేల్చుకోండి నాయనలారా తేల్చుకోండి యువతా. ఇప్పటికైనా చంద్రయాన్ వెలుగులోకి తెచ్చినవన్నీ నమ్మండోయి. అన్ని పురాణాల్లో ఉన్నవనే మతస్తులకు ధీటుగా సమాధానం ఇవ్వండోయి. మేలుకోండి యువతా మేలుకోండి. అబ్బో ఏంటి బావా ఈ రోజు గంతులేస్తూ పాడుతూ వస్తున్నావ్. ఆ హుషారుకు కారణమేంటో చెప్పవయ్యా. అదె నువ్వంటె కోపం. అన్ని తెలిసి ఏమీ తెలియనట్లు మాట్లాడతావ్. ఒకపక్క అమెరికా, చైనా లాంటి అగ్ర దేశాలు మన చంద్రయాన్ మొదటిసారి చంద్రుని మీద కాలు మోపినందుకు అసూయ పడుపోతుంటె నువ్వేమో ఏమీ ఎరగనట్లు మాట్లాడతావు. ప్రపంచ పటంలో అగ్రగాములుగా మన శాస్త్రవేత్తలు నిలిచిపోయారు. మన దేశం గర్వపడేలా మన శాస్త్రవేత్తలు కృషి చేశారు. ఇపుడు ఆ ధైర్యంతో సూర్యమాన్‌ను వదిలారు. అది కూడ విజయం సాధించి తీరుతుంది. ఇపుడు మతస్తుల నోరు మూతపడుంది గద. అదె నా సంతోషం. నిజమేనయ్యా. మతం శాస్త్రంపై ప్రత్యక్షంగాను, పరోక్షంగానే యిప్పటి వరకు దెబ్బ కొడుతూనే ఉంది. అసలు ఈ మతస్తులు ఎలాంటి వారంటె యోగి వేమన రాసిన పద్యాలు చదివి తట్టుకోలేక ఆయన భావాలకు వ్యతిరేకంగా కొందరితో రాయించి వాటిని వేమన రాసినట్లుగ ముద్రించారు. వాటిని మార్కెట్‌లో



పెట్టి వారు కుతి తీర్చుకుంటున్నారని వేమన శిష్యులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇపుడు భారత శాస్త్రవేత్తలు ఈ విజయం సాధించకపోతే యింకా చందమామపై పాటలు రాస్తూనె ఉండిపోతారు.

సైన్సుకు మతం మొదటి నుండి విరోధి. బ్రూనో, గెలీలియో, కోపర్నికస్ లాంటి శాస్త్రవేత్తలను ఈ మతస్తులు ఎన్నో యిబ్బందులు పెట్టారు. యిప్పటికి శాస్త్రవేత్తలను, హేతువాదులను చంపుతూనె ఉన్నారు. అది సరె కృష్ణాజిల్లా వాసి చంద్రునిపై రెండు ఎకరాల భూమి కొన్నానని ఐక్యరాజ్య సమితికి కూడ తెలుసని అన్ని పత్రాలు చూపుతున్నాడు. ఎంత ముందు చూపు ఉన్న మనిషో. అదె మరి, చంద్రయాన్ వదిలిననాడె చెబితె నువు వినలేదు. ఆగవయ్యా అపుడె తొందరేంటి యింకా చంద్రునిపైన ఉన్నవి ఏమిటో తెలియాలి కదా? అక్కడ నీరుందని మాత్రం తెలిసింది. అక్కడ ఎనలేని ఖనిజ సంపద ఉన్నదనె ఊహలో ఉన్నారు. ధృవీకరించలేదు. అసలు శాస్త్రానికి మతం బద్ధ విరోధి. శాస్త్రాన్ని ఒప్పుకోదు. మూఢ నమ్మకాల్ని వదలి శాస్త్ర జ్ఞానంతో ఆలోచించాలన్న అమలాపురం పార్లమెంటు సభ్యున్ని గతంలో రాళ్లతో కొట్టమన్న మతస్తుల్ని ఎలా అర్థం చేసుకోవాలి. శాస్త్రజ్ఞులు, మతస్తులకు భయపడి తమ హేతువాద భావాల్ని తమలోనె దాచుకున్న సంఘటనలున్నాయి. అసలు మతమనేది స్వతంత్ర ఆలోచనను, నిశిత పరిశీలనను, నిర్ణయాల మార్పును అంగీకరించదు. ఆస్థికత, మతం సత్యాలైతే మనిషి ఆలోచించవలసిన అవసరం ఉండదు. మెదడును నిద్ర పుచ్చవచ్చు. శాస్త్రజ్ఞులు ఆలోచించడం మాని, చేతులు ముడచుకు కూర్చోవచ్చు. నిజమె అప్పుడు యింత ఘన విజయం మనకు దక్కేది కాదుగద. భూమ్యాదిగ్రహాలు తిరుగుతున్నాయన్న కోపర్నికస్‌ను మార్టిన్ లూథర్ అనే మతస్తుడు ఖగోళ శాస్త్రాన్ని తలకిందులు చేయడానికి వచ్చిన ఫూల్‌గ వర్ణించాడు. శాస్త్రం నమ్మకాన్ని ప్రశ్నిస్తుంది. మతం ప్రశ్నను నిషేధిస్తుంది. 250 సంవత్సరాల అనంతరం పరిణామ సిద్ధాంతం ద్వారా డార్విన్ రేపిన దుమారం మతస్తుల నోరు మూయించగలిగింది. భూమి తిరుగుతుందని చెప్పడం మతస్తులు అబద్ధమన్నారు. శాస్త్రజ్ఞుల మధ్య వైరుధ్యం ఎక్కడా గోచరించదు. ఎందుకంటె శాస్త్రం చెప్పింది సత్యం కనుక. మతం మాత్రం పాత పురాణాలలో ఉన్నవి నమ్మి అందరిని నమ్మమంటుంది. బుద్ధుడిని పదకొండవ అవతారంగ పూజించడానికి మతస్తులు సిద్ధపడినా వీలుకాక బుద్ధుని ఆరామాలన్ని ధ్వంసం చేశారు. నిజమె బావ మతం కంటె మానవత్వం ముఖ్యమని మూఢనమ్మకాలు వదలి శాస్త్రీయంగా ఆలోచించమని చెప్పిన అభ్యుదయ వాదులందరిని మతస్తులు మట్టుపెట్టారు. అటువంటి దుర్మార్గం యిప్పటికి కొనసాగడం హర్షణీయం కాదు. కాని మోదీ చంద్రయాన్ కాలు మోపిన స్థలానికి శివశక్తి అని నామకరణం చేయగానె కొందరు మతస్తులు అక్కడ శివలింగాలున్నవని ప్రచారం మొదలుపెట్టారు. అసలు మోదీ గద్దెనెక్కాక అనేక రకాలుగ మతస్తులు విజృంభించారు. అందుకు హేతువాది, ప్రముఖ రచయిత్రి గౌరిలంకేశ్‌ను చంపడమె ఉదాహరణ. మనుషుల్ని చంపితె పట్టించుకోనివారు గోవుల్ని చంపితె ఉగ్రరూపం దాల్చుతారు. అతి పెద్ద ప్రజాస్వామ్య దేశమని చెప్పుకుంటున్న మన దేశంలో ఈ విధంగా ప్రవర్తిస్తున్న మతవాదులను అదుపుచేసి అన్ని మతాలకు స్వేచ్ఛ యివ్వవలసిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదె అనే సంగతి మరువరాదు. ఇపుడు సనాతన ధర్మాలకు స్వస్తి పలకాలని వాటిని నిర్మూలించాలన్న ఉదయనిదిస్టాలిన్‌ను చంపితె కోట్లు యిస్తామని ఒక మత ఉగ్రవాది అనడం చూస్తె మత పిచ్చి తలకెక్కిందని చెప్పవచ్చు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం సర్వ మతాలకు స్వేచ్ఛ ఇవ్వడానికి తగు చర్యలు తీసుకోవాలి.

సెల్: 9885569394

వ్యవసాయాన్ని నిర్లక్ష్యం చేసిన మోదీ

చలసాని వెంకటరామారావు

ఆదర్శ రాజ్యస్థాపనకు కలలుగన్న గ్రీకు తత్వవేత్త ప్లేటో పాలకుడు ఒక తత్వవేత్తగా, విద్యావంతునిగా ఉండాలని భావించాడు. సమాజం అభివృద్ధి సాధించాలంటే పాలకులు, సైనికులు, రైతులు మూడు తరగతులుగా క్రియాశీలకపాత్ర వహించాలని భావించారు. రైతులు అంటే ఉత్పత్తిలో భాగస్వాములైన రైతులు, కూలీలు, కార్మికులు అనే భావనలో ఆయన సిద్ధాంతీకరించారు. కానీ నేటి భారత ప్రజాస్వామ్య వ్యవస్థలో పాలకుల వైఖరి వల్ల ఆదర్శరాజ్య నిర్మాణం చేయాలనే కలలు కల్లలుగా మారిపోయాయి. కొన్ని వర్గాల ప్రయోజనాలే పరమావధిగా పాలకవర్గాలు అన్యాయం, అక్రమాలకు నిలయాలుగా మారిపోతున్నారు. సమాజంలోని కొన్ని వర్గాలు అన్యాయానికి గురైతే దేశంలో అంతర్యుద్ధం, ద్వేషం, పోరాటాలకు కారణం అవుతుంది. గత 9ఏళ్ల బీజేపీ నేతృత్వంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం విద్వేషాలకు ఆజ్యంపోసే రీతిలో పాలన సాగిస్తున్నది. దీనికి నిరసనగా దేశవ్యాప్తంగా రైతులు, కార్మికులు, ఉద్యోగులు వివిధ వర్గాల ప్రజలు తీవ్ర ఆందోళనలు చేసినా ప్రభుత్వం తన విధానాలను మార్చుకోకపోగా మరింతగా ప్రజలను చీల్చేవిధంగా మతం, కులం, సంస్కృతిపరంగా విభజించిపాలించే రాజనీతిని ప్రయోగిస్తున్నది. ఆర్థికరంగంలో పేదల సంక్షేమం విస్మరించి కొద్దిమంది కార్పొరేట్ల ప్రయోజనంకోసం దేశ వనరులను దుర్వినియోగం చేస్తున్నది. అనివార్యస్థితిలో 2023 ఆగస్టు 24న దేశ రాజధాని న్యూఢిల్లీలోని తల్కతోరా స్టేడియంలో కేంద్ర కార్మికసంఘాల ఐక్యవేదిక, వివిధ ఉద్యోగ ఫెడరేషన్లు, అసోసియేషన్లతోపాటు సంయుక్త కిసాన్ మోర్చాకు చెందిన వేలాదిమంది రైతులు, కార్మికులు రానున్నకాలంలో పెద్దఎత్తున మోదీ ప్రభుత్వ రైతు, కార్మిక వ్యతిరేకం విధానాలపై సమరసంఖం పూరించాలని నిర్ణయించారు.

కేంద్ర ప్రభుత్వం రైతులను, వ్యవసాయ రంగాన్ని, తీవ్రంగా నిర్లక్ష్యం చేసిన ఫలితంగా దేశంలో రైతుల ఆత్మహత్యలు పెరిగిపోయాయి. పంట పొలాల మధ్య జీవనపోరాటం చేయాల్సిన రైతులు పాలకుల వైఖరితో విసిగివేసారి రోడ్లపై బైఠాయింపులు చేయవల్సి వస్తున్నది. రైతుల ఆదాయం రెట్టింపు చేస్తానన్న ప్రభుత్వ వాగ్దానం నెరవేరకపోగా రైతులకు గిట్టుబాటుధర గ్యారంటీ లేకుండాపోయింది. స్వామినాథన్ కమిటీ సిఫారసులను ప్రభుత్వం అటక ఎక్కించింది. ఎరువులు, పురుగుమందుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. పుండుమీద కారం చల్లినట్లు ఆయిల్ ధరలు, విద్యుత్ కోతలు, వ్యవసాయ పెట్టుబడులు, రైతులను బెంబేలెత్తిస్తున్నాయి. ఉపాధి హామీ పథకానికి పూర్తిస్థాయిలో వ్యవసాయాన్ని అనుసంధానించకపోవటంతో కూలీల కొరతతో పండినపంట చేతికిరాక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ యాజమాన్యంలోని గోడౌన్లను పక్కనబెట్టి ప్రైవేటు రంగంలో భారీ గోడౌన్ల నిర్మాణానికి ప్రోత్సాహం అందిస్తున్నారు. దీని నిమిత్తం రైతుల సాగులోని విలువైన భూములను, ప్రభుత్వ భూములను కార్పొరేట్లకు అప్పగిస్తున్నారు. పంటల బీమా పథకాన్ని అమలు చేయటంలో గ్రామాలు ప్రాతిపదికగా తీసుకోవాలనే డిమాండ్‌ను ప్రభుత్వం పెడచెవిన పెడుతున్నది. ఉద్యానవన పంటలకు బీమా సౌకర్యం లేనందున ప్రకృతి వైపరీత్యాలకు, తెగుళ్లకు రైతులు బలిపశువులుగా మారుతున్నారు. పంటల బీమా పథకం ఆచరణలో రైతులకు ఏమాత్రం ఉపయోగంలేని వ్యర్థపథకంగా మిగిలిపోతున్నది. నేడు దేశంలో రైతాంగం ఎన్నడూలేని విధంగా దుర్భర దారిద్ర్యాన్ని ఎదుర్కొంటున్నది. వ్యవసాయం గిట్టుబాటుకాక గత్యంతరంలేని స్థితిలో రైతాంగం ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలవైపు మళ్లుతున్నది. కౌలు రైతులు వ్యవసాయంమీదనే ఆధారపడటంవల్ల ఉత్పత్తి తగ్గి వినియోగదారులపై తీవ్ర భారం పడుతున్నది.

ఇక కార్మికులు, ఉద్యోగులు అధిక ధరలతో తమ నిజవేతనాలు పడిపోయి అస్తవ్యస్త పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. ఉన్న ఉద్యోగాలను కోల్పోతున్నారు. నిరుద్యోగసైన్యం రోజురోజుకు పెరిగిపోతున్నది. శాశ్వత ఉద్యోగాలకల్పన ఎండమావిగా మారింది. కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్, తాత్కాలిక ఉద్యోగాలు కల్పించి సమస్య తీవ్రత తక్కువ చేయాలని ప్రభుత్వం భావిస్తున్నది. పనిగంటలు పెంచి శ్రామికుల శ్రమశక్తిని దోపిడీ చేయాలని చూస్తున్నది. అంతర్జాతీయ కార్మికసంస్థ ఐఎల్ఓ తీర్మానాల అమలులో భారత ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నది. 2015 నుండి 'ప్రభుత్వం-యాజమాన్యం- కార్మికులు'తో కూడిన త్రైపాక్షిక సమావేశాన్ని ఉద్దేశపూర్వకంగా ప్రభుత్వం నిర్వహించటంలేదు. ఐఎల్ఓ 144వ తీర్మానాన్ని కార్మికసంఘాలు ఎన్నిసార్లు కోరినా అమలును ప్రభుత్వం నిరాకరిస్తున్నది. ఎటువంటి సంప్రదింపులు, చర్చ జరగకుండానే కార్మిక కోడ్‌లను ప్రభుత్వం ఆమోదించింది. పాతపెన్షన్ స్కీం అమలుకు దేశవ్యాప్తంగా ఆందోళన జరుగుతున్నా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నది. దేశశ్రామిక జనాన్ని కార్పొరేట్ కంపెనీలు దోపిడీకి గురిచేస్తున్నా, వారి హక్కుల పట్ల ప్రభుత్వం స్పందించడం లేదు. "పేదలనుకొట్టి పెద్దలను మేపే" చర్యలకు పూనుకుంటున్నది. గత తొమ్మిదేళ్లుగా ప్రభుత్వరంగాన్ని విచ్చలవిడిగా మోదీ ప్రభుత్వం అమ్మివేస్తున్నది. లక్షల కోట్ల కార్పొరేట్ల రుణ బకాయిలను రద్దుచేసి, పేదలపై భారంమోపుతున్నది. గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ప్రభుత్వ పంపిణీ పథకాన్ని నిర్వీర్యం చేస్తున్నది. జీఎస్టీ పేరుతో ప్రజలపై పన్నులభారం పెరిగిపోయింది. రైతు రుణమాఫీ పథకాన్ని అమలుచేసి సంక్షోభంలోఉన్న వ్యవసాయరంగాన్ని గట్టెక్కించే ప్రయత్నం జరగడంలేదు.

దేశంలో పేదరికం, అసమానతలు పెరిగిపోతున్నాయి. మానవ స్వేచ్ఛా సూచీలో 2022నాటి భారతదేశం 165 దేశాలలో 112 వ స్థానానికి దిగజారింది. అంటే చట్టబద్ధపాలన, భావ వ్యక్తీకరణ, సమాచార స్వాతంత్ర్యం, పరమత సహనం, ప్రభుత్వ అణచివేతలలో మనం ఎక్కడున్నామో అర్థం చేసుకోవచ్చు. మానవాభివృద్ధి సూచీలో 191 దేశాలలో 132వ స్థానంలో మనం ఉన్నాం. 2023 వీ-డెమ్(స్వీడన్) నివేదిక ప్రకారం, ప్రజాస్వామిక ఎన్నికక్రమంలో 179 దేశాలలో మనం 108వ స్థానం పొందాం.

2023 ఆక్స్‌ఫాం నివేదిక ప్రకారం టాప్ 5శాతం జనాభా చేతిలో 60శాతం దేశసంపద పోగుపడింది. 2018లో 19కోట్లుగా ఉన్న భారత క్షుధార్తుల సంఖ్య 2022నాటికి 35కోట్లకు పైగా చేరుకుంది. ఈ దేశం సంపన్నమైనా ప్రజలు పేదలుగా మారిపోతున్నారు. ఆదాయ అసమానతలు పెరిగిపోతున్నాయి. ఉపాధి అవకాశాలు తగ్గిపోతున్నాయి. పేదరికం, ఆకలిదప్పులకు, నిరుద్యోగిత, అనారోగ్యం, దుర్భరవేదనతో సాధారణ జన జీవనం తీవ్ర ఇక్కట్లు పాలవుతున్నది. దేశంలో 10 కోట్ల ప్రభుత్వ ఉద్యోగాలు ఉన్నా నిపుణుల కొరత వేధిస్తున్నది. అయినా విదేశీ వలసల పరంపరం కొనసాగుతున్నది. దేశ జనాభాలో 35ఏళ్ల యువతరం 66శాతంగా ఉంది. వీరి అవసరాలకు అనుగుణంగా విద్య, ఉపాధి, శిక్షణ వంటి కార్యక్రమాల నిర్వహణలేదు. సాధారణ ప్రజల ఆదాయం పెరిగితేనే ప్రజల జీవనప్రమాణాలు పెరుగుతాయి. అప్పుడే దేశం అభివృద్ధి చెందినట్లు లెక్క. ఈ వాస్తవాలు తెలిసినా పాలకులు తెలియనట్లు తెలివిగా వ్యవహరిస్తున్నారు. గత తొమ్మిదిఏళ్లుగా రేవులు, విద్యుత్ కేంద్రాలు, విమానాశ్రయాలు, చమురు, బొగ్గు, గనులు, బ్యాంకింగ్, ఇన్సూరెన్స్ రంగాలు ఆశ్రిత పెట్టుబడిదారులు చేతుల్లోకి వెళ్లిపోయాయి. ఈ దేశ అపరకుబేరుల చేతుల్లో అపార సంపద చేరింది. సామాన్య ప్రజలు పేదరికంలో మగ్గుతున్నారు. అయినా దేశం గొప్పగా ఉందని, ప్రజల జీవన ప్రమాణాలు పెరిగాయని మోదీ ప్రభుత్వం ప్రచారం చేస్తున్నది. 2047 నాటికి దేశం ప్రపంచంలో ధనిక దేశాల సరసన చేరుతుందని ప్రచారం చేస్తున్నారు. కానీ వాస్తవ పరిస్థితులు దీనికి భిన్నంగా ఉన్నాయి. "ఇంటిపేరు కస్తూరి వారు ఇంటిలో గబ్బిలాల కంపు" అన్నట్లుగా దేశం స్థితి తయారైంది. ఈ వాస్తవాల వెలుగులో మోదీ ప్రభుత్వ విధానాలకి వ్యతిరేకంగా దేశ రైతాంగం, కార్మికుల ఐక్యపోరాటం జరపాలని నిర్ణయించటం, అందుకు కార్యాచరణకు దేశం ముందుపెట్టటం హర్షించదగ్గ పరిణామం. దేశ భవిష్యత్తుపై తాత్విక కార్యాచరణ కలిగిన నాయకత్వ ఎంపికకు ఈ పోరాట క్రమం దోహదం చేస్తుందని ఆశిద్దాం.

ఏఐటీయూసీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు
ఫోన్: 9490552093

నిరుద్యోగ యువతతో ప్రభుత్వాలు దోబూచులాట

దేశ జనాభాలో 34 శాతం యువత(15-29 ఏండ్ల వయస్సు) ఉన్నది. ప్రపంచంలోనే అత్యధిక శాతం యువత కలిగిన దేశంగా ఇండియాకు 'యువ భారత్' అనే ప్రత్యేక పేరున్నది. 2030 నాటికి భారత్‌లో 36.5 కోట్ల యువత ఉంటారని అంచనా. అయితే ఉన్నత విద్యలో యువత నమోదు రేటు తక్కువగా (27.3 శాతం) ఉంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నా నియామకాలు తక్కువగా ఉన్నాయి. ప్రస్తుత ఉద్యోగుల రిటైర్‌మెంట్ల సంఖ్య ప్రతి నెల పెరుగుతున్నాయి. ఖాళీలు ఏర్పడిన వెంటనే ఉద్యోగ భర్తీ ప్రక్రియలు చేయాల్సిన ప్రభుత్వాలు ఏళ్ల తరబడి యువత భవితతో ఆటలు ఆడుతున్నాయి. యువ భారత్‌గా పేరొందిన దేశంలో ఉద్యోగ ఖాళీలతో ప్రభుత్వ యంత్రాంగం, ప్రజాసేవలు నత్తనడక నడుస్తున్నాయి. ఉద్యోగాల భర్తీతో ప్రభుత్వాలపై ఆర్థిక భారం పడుతుందనే అసంబద్ధ బహిరంగ రహస్య నిర్ణయాలతో ప్రభుత్వాలు భర్తీలకు సుముఖత వ్యక్తం చేయడం లేదు.

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల్లో లక్షల ఉద్యోగ ఖాళీలు:

కేంద్ర ప్రభుత్వంలో ఉన్న 40 లక్షల ఉద్యోగాల్లో 22 శాతం, అనగా 10 లక్షల ఖాళీలు ఉన్నాయని, వాటి భర్తీ ప్రక్రియను రానున్న 18 నెలల్లో పూర్తిచేస్తామని ఇటీవల ప్రభుత్వం ప్రకటించింది. దేశవ్యాప్తంగా ఉన్న జాతీయ బ్యాంకులు, రక్షణశాఖ, వైద్యఆరోగ్య శాఖ, కేంద్రీయ విశ్వవిద్యాలయాలు, న్యాయశాఖ లాంటి విభాగాల్లో 30 లక్షల ఉద్యోగాల వరకు ఖాళీగా ఉన్నాయని తెలుస్తున్నది. దేశంలోని ఒక్కొక్క రాష్ట్ర, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఖాళీలు లక్షల్లో ఉంటాయనేది వాస్తవం. ప్రభుత్వంలో పెరిగిన ఉద్యోగ ఖాళీలతో ప్రభుత్వ పథకాలఅమలు, ప్రజా సంక్షేమ కార్యక్రమాలు ఆలస్యం కావడం, అవినీతి, చీడపీడలు పెరగడం సర్వసాధారణం అయ్యింది. రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కేవలం ఉద్యోగ ప్రకటనలతో యువతను ప్రసన్నం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నాయనే వార్తలుకూడా ప్రచారంలో ఉన్నాయి. ఉద్యోగ భర్తీ ప్రక్రియలను వేగిర పరచాలని యువత కోరుకుంటున్నది.

ఒప్పంద లేదా అవుట్ సోర్సింగ్ ఉద్యోగాలు:

దీనికి తోడుగా స్వల్ప వేతనాలతో 'ఒప్పంద ఉద్యోగాలు (కాంట్రాక్ట్ జాబ్స్) లేదా అవుట్ సోర్సింగ్'తో పాటు అంగన్‌వాడీల లాంటి గౌరవ వేతన జీవుల(హానరరీ వర్కర్స్)కు పనికలిపిస్తూ ప్రభుత్వాలు యువశక్తిని అప్పనంగా దోచుకుంటున్నాయి. ప్రతి ఏటా ఒప్పంద ఉద్యోగుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. 2017లో 11.11 లక్షలు, 2020లో 13.25 లక్షలు, 2021లో 24.31 లక్షల ఒప్పంద ఉద్యోగాలు కల్పించినట్లు గణాంకాలు తెలుపుతున్నాయి. తక్కువ వేతనంతో, అపరిశుభ్ర వాతావరణంలో పని చేస్తున్న ఒప్పంద, అవుట్ సోర్సింగ్, గౌరవ వేతన ఉద్యోగులు దిక్కులేని దుస్థితిలో సేవలు అందిస్తున్నారు.

ఉద్యోగ ఉపాధులను పెంచడం:

ఏప్రిల్ 2022లో దేశ ఉద్యోగ ఉపాధుల సంఖ్య 43.62 కోట్లు ఉందని, 42.13 శాతం శ్రమజీవులకు పని కల్పించడమైందని, యువత నిరుద్యోగ రేటు 20 శాతంగా ఉందని తేలింది. ప్రపంచ బ్యాంకు అంచనాల ప్రకారం భారత్‌లో ప్రతి ఏట 50 -70 లక్షల వర్కర్స్ అదనంగా చేరుతున్నారు. బ్యాక్‌లాగ్ నిరుద్యోగులు 3 కోట్లు ఉన్నట్లు అంచనా. రానునన్న 18 మాసాల్లో కేవలం 10 లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించడం సహేతుకంగా లేదు. ఇదే దుస్థితి అన్ని కేంద్రపాలిత ప్రాంతాలు, రాష్ట్రాల్లో కూడా నెలకొని ఉంది.

ప్రైవేట్ ఉద్యోగ ఉపాధులు:

ఉద్యోగ కల్పనలో ప్రైవేట్ రంగం కూడా నిరుత్సాహపరుస్తున్నది. సాధారణంగా ప్రైవేట్ యంత్రాంగాలు తక్కువ ఉద్యోగులతో ఎక్కువ పని చేయించుకొని, తక్కువ వేతనాలనుఇస్తూ శ్రమ దోపిడీ చేస్తున్నారనే అపవాదు ఉంది. దేశంలో నెలకొన్న నిరుద్యోగ సమస్యకి ఆజ్యం పోస్తున్నట్లుగా కరోనా వైరస్ అలలు ప్రజలను కుదిపేశాయి. ఉక్రెయిన్ రష్యా యుద్ధం ధరల పెరుగుదలకు మరో ప్రధాన కారణం కావడంతో ఆర్థిక చిక్కులు, నిరుద్యోగం, ఆకలి చావులు పెరుగుతూనే ఉన్నాయి. ప్రైవేట్ రంగం కరోనా, యుద్ధం పేరుతో ఉద్యోగులను తొలగించడం, వేతనాల్లో కోతలు విధించడం జరిగిపోయింది. ఇలాంటి నిరుద్యోగ సంక్షోభానికి విరుగుడుగా ప్రభుత్వాలు పూర్తి ఉద్యోగాల ఖాళీలను సత్వరమే భర్తీ చేయాలి. యువశక్తి నిర్వీర్యం కాకుండా సకాలంలో జాగ్రత్త పడాలి. నిరుద్యోగ యువతలో నిరాశలు పెరిగితే సమాజంలో శాంతి హరించుకుపోతుంది.

పట్టణ నిరుద్యోగం: కరోనా కల్లోలంలో పట్టణ ఆర్థిక వ్యవస్థలు కుప్ప కూలాయి. నిరుద్యోగం, పేదరికం పెరిగాయి. వేతనం తగ్గింది. పట్టణ యువత ఉద్యోగాల కల్పనకు సత్వరమే ఉపాధి హామీ పథకాలు ప్రవేశ పెట్టాలి. గ్రామీణానికి విరుద్ధంగా పట్టణ యువతకు వివిధ సాంకేతిక అంశాల్లో ప్రత్యేక శిక్షణలు, చిన్న వ్యాపారాల స్థాపనకు ఆర్థిక సహాయం, ఆన్‌లైన్ సేవల ఉద్యోగాలు లాంటి విభాగాల వైపు

యువత దృష్టిని ఆకర్షించాలి.

ప్రభుత్వాల కనీస బాధ్యత:

ప్రభుత్వాలు ప్రస్తుత ఉద్యోగ ఖాళీలను భర్తీచేస్తూనే, కొత్త ఉద్యోగ ఉపాధుల కల్పనకు పథక రచనలు చేయాలి. ఉద్యోగ ఉపాధుల లేమితో వైద్య, ఆరోగ్య, పోషకాహార, విద్య, అక్షరాస్యత, నైపుణ్యాలు, మహిళలు, బాలల భద్రత, తాగునీరు, పారిశుద్ధ్యం లాంటి కనీస అంశాల్లో సమస్యలు ఉత్పన్నం అవుతాయి. కనీస అవసర వ్యవస్థలను ప్రైవేటీకరణ చేయకుండా ప్రభుత్వాలు అన్ని వర్గాల ప్రజల శ్రేయస్సు, మానవ వనరుల అభివృద్ధి, కనీస మౌళిక వసతుల కల్పనకు చొరవ చూపాలి. దీనితో పాటు పారిశ్రామికీకరణ పాలసీలను పునఃసమీక్షిస్తూ సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు (యంయస్‌యంఈలు) ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిస్తూ, ఉత్పత్తి పెంచుతూ, ఆర్థిక చేయూతను ఇస్తూ ఉద్యోగ ఉపాధులు కల్పించాలి. యువశక్తిని దేశాభివృద్ధికి వినియోగిస్తూ, మానవ వనరులను నైపుణ్య నిధులుగా మార్చుతూ, ఉద్యోగ ఉపాధులతో పాటు ఔత్సాహిక వ్యాపారవేత్తలుగా యువతను తయారుచేసేందుకు ప్రభుత్వాలు, ప్రైవేట్ రంగాలు ప్రముఖ పాత్రను పోషించాలి. యువతే దేశ భవిత అంటూ ముందుకు సాగాలి.

డా: బుర్ర మధుసూదన్ రెడ్డి
కరీంనగరం - 9949700037

అభివృద్ధి చెందుతున్న దేశాలకు వారధిగా భారత్

- ప్రతి గొంతు వినిపించాలి
- ప్రతి దేశం తోడ్పాటు ఉండాలనేదే లక్ష్యం
- మా నాయకత్వంతో తగ్గుతున్న దూరాలు, తొలగుతున్న అడ్డంకులు
- పెరిగిన ఆఫ్రికా ప్రాతినిధ్యం
- జీ20కి అధ్యక్షతపై ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: ప్రపంచ వేదికపై అభివృద్ధి చెందుతున్న దేశాలకు వారధిగా నిలవాలన్న లక్ష్యంతో జీ20 అధ్యక్ష బాధ్యతలను భారత్ చేపట్టిందని ప్రధాని మోదీ ఉద్ఘాటించారు. జీ20కి భారత్ అధ్యక్షత వహిస్తుండటంతో దూరాలు తగ్గుతూ అవరోధాలు తొలగుతున్నాయని, సయోధ్య పెరుగుతోందని చెప్పారు. ప్రపంచం ఐక్యంగా ముందుకెళ్లేందుకు మార్గం సుగమవుతోందన్నారు. కలిసికట్టుగా సమస్యలను పరిష్కరించుకుందామని సభ్యదేశాలకు పిలుపునిచ్చారు. జీ20 అన్నది ప్రజాకార్యంగా మారిందని, 200కుపైగా సమావేశాలను 60కుపైగా భారతీయ నగరాల్లో నిర్వహించామని మోదీ చెప్పారు. తమ పదవీ కాలం ముగిసే లోపు 125 దేశాల నుంచి 1,00,000 మంది ప్రతినిధులకు ఆతిథ్యమిస్తామన్నారు. ఇంత విస్తృత స్థాయిలో ఏ దేశ అధ్యక్షత సాగలేదని మోదీ తెలిపారు. భారతీయ జనాభా, ప్రజాస్వామ్యం, వైవిధ్యత, అభివృద్ధి గురించి ఎవరో చెబితే వినడం కాదు ప్రత్యక్షంగా అనుభవించే అవకాశాన్ని జీ20 ద్వారా ప్రపంచ దేశాల ప్రతినిధులకు కల్పిస్తున్నట్లు వెల్లడించారు. జీ20కి భారత్ అధ్యక్షత కారణంగా లింగ అసమానతలు, కార్మికశక్తిలో వ్యత్యాసాలు తగ్గుతున్నాయని, మహిళలు నాయకులుగా, నిర్ణేతలుగా పురోగతి సాధిస్తున్నారని చెప్పారు. ప్రజాస్వామ్యానికి తల్లిగా... వైవిధ్యతకు నమూనాగా తమ అనుభవాలతో ప్రపంచానికి ద్వారాలను భారత్ తెరుస్తోందని మోదీ అన్నారు. అభివృద్ధి చెందుతున్న దేశాలకు వారధిగా భారత్‌కు మద్దతివ్వాలని కోరారు. అంతర్జాతీయ వేదికను విస్తృతపర్చే లక్ష్యంతో ప్రతి గొంత వినిపించేలా... ప్రతి దేశం తోడ్పాటు ఉండేలా ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. ఇందుకోసం తీసుకున్న ప్రతిజ్ఞకు అనుగుణంగా చర్యలు, ఫలితాలు ఉన్నాయని మోదీ సంతృప్తి వ్యక్తం చేశారు. గ్లోబల్ సౌత్ సదస్సు గొంతుక అంటే 125 దేశాల ఐక్యస్వరమని అన్నారు. భారత్ అధ్యక్షత కాలంలో ఆఫ్రికా దేశాల ప్రాతినిధ్యం పెరిగిందని తెలిపారు. ఆఫ్రికన్ యూనియన్‌కు జీ20లో శాశ్వత సభ్యత్వం కల్పనకూ తాము చొరవ తీసుకున్నట్లు చెప్పారు. వాతావరణ సవాళ్లను ఎదుర్కొనేందుకు సమ్మిళిత కృషి అవశ్యమని సూచించారు. వాతావరణ ఫైనాన్స్, సాంకేతిక బదిలీ వంటివి వాతావరణ సంబంధిత చర్యల లక్ష్యాలకు అనుగుణంగా ఉండాలని అన్నారు. ఏమి చేయాలనే స్పష్టత ఉండాలిగానీ ఇదే చేయాలి... ఇలానే చేయాలన్న పట్టింపు ఉండరాదని, కాస్తంత పట్టు విడుపులు ఉండటం అవసరమని సూచించారు. వాతావరణ మార్పు నేపథ్య సవాళ్లను కలిసి పరిష్కరించుకోగలమని సూచన చేశారు. ప్రపంచ అనుసంధానం అంటే అర్థం సవాళ్లు కూడా ముడిపడే ఉంటాయని అన్నారు. సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనలో పురోగతి గాడి తప్పిందన్న ఆందోళన అనేక దేశాల్లో ఉందని చెప్పారు. సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనకు అనుకూలంగా జీ20–2023 కార్యాచరణ ప్రణాళిక ఉందని మోదీ అన్నారు. పూర్వకాలం నుంచి భారత్‌లో సామరస్య జీవనం ఉందని, ఆధునిక కాలంలో వాతావరణ చర్యలకు అది తోడ్పాటు అందిస్తోందన్నారు. గ్లోబల్ సౌత్ దేశాలు అభివృద్ధి దశలో ఉన్నాయని, వాతావరణ చర్యలన్నవి పరిపూరకరమైన అన్వేషణ (కాంప్లిమెంటరీ పర్స్యూట్)గా ఉండాలని మోదీ నొక్కిచెప్పారు. అంతర్జాతీయ సమాజం ఆదరణ పొందిన యోగా వలే సుస్థిర పర్యావరణ జీవనశైలుల (లైఫ్)ను ప్రపంచం ఆదరించాలని సూచించారు. వాతావరణ మార్పు ప్రభావం వల్ల ఆహారం, పౌష్టికాహార భద్రత కీలకంగా మారిందని, తృణధాన్యాలు లేక శ్రీఅన్న వంటి వాటివల్ల వాతావరణం- స్మార్ట్ సాగుకు ప్రోత్సాహం అందించవచ్చన్నారు. ఇది అంతర్జాతీయ తృణధాన్యాల సంవత్సరమని, తృణధాన్యాలను ప్రపంచ పళ్లెంలోకి తీసుకెళ్లామని చెప్పారు.

భారత్ వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ అని, సుస్థిరత, ఆచరణ సాధ్య పరిష్కారాలతో సత్ఫలితాలు సాధిస్తోందని చెప్పారు. అంతరిక్షం నుంచి క్రీడల వరకు, ఆర్థిక వ్యవస్థ నుంచి ఎంట్రప్రెన్యూర్‌షిప్ వరకు రాణిస్తున్నట్లు మోదీ తెలిపారు. వివిధ రంగాల్లో భారతీయ మహిళలు సత్తా చాటుతున్నారని, మహిళా సాధికారత దశ నుంచి మహిళల నాయకత్వంలో అభివృద్ధి జరిగే స్థాయికి భారత్ చేరుకున్నదని ప్రధాని వక్కాణించారు.

బెంగాల్ ఎమ్మెల్యేల వేతనం భారీగా పెంపు

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ ఎమ్మెల్యేల వేతనాలను పెంచుతూ ముఖ్యమంత్రి మమతాబెనర్జీ నిర్ణయం తీసుకున్నారు. రూ. 40వేల వరకు ఎమ్మెల్యేల జీతాన్ని పెంచుతున్నట్లు ఆమె తెలిపారు. రాష్ట్ర అసెంబ్లీలో గురువారం ఆమె ఈ ప్రకటన చేశారు. అయితే ముఖ్యమంత్రి నెల జీతాన్ని మాత్రం మార్చడం లేదన్నారు. చాన్నాళ్ల నుంచి సీఎం మమతా బెనర్జీ ఎటువంటి జీతాన్ని తీసుకోవడం లేదు. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే... బెంగాల్‌లో ఎమ్మెల్యేల జీతాలు చాలా తక్కువగా ఉన్నాయని, అందుకే రూ.40వేల చొప్పున జీతాన్ని పెంచాలని నిర్ణయం తీసుకున్నట్లు దీదీ తెలిపారు. పెరిగిన వేతనంతో ప్రస్తుతం రూ.10వేలుగా ఉన్న ఎమ్మెల్యేల వేతనం రూ.50వేలకు పెరగనుంది. అలాగే రూ.10,900గా ఉన్న మంత్రుల వేతనం రూ.50,900కి పెరగనుంది. ఇక కేబినెట్ మంత్రుల వేతనాలు రూ.11 వేల నుంచి రూ.51వేలకు పెరగనున్నాయి. అలవెన్సులు, ఇతర ప్రయోజనాలు వేతనాలకు అదనం. ఇవన్నీ కలుపుకుంటే ఎమ్మెల్యేలకు ఇకపై రూ.1.21 లక్షలు, మంత్రులకు రూ.1.50 లక్షల చొప్పున నెలవారీ లభిస్తాయి.

జూన్ 20న బెంగాలీ కొత్త సంవత్సరం...

పొలై బైసాకీ రోజును.. బెంగాలీ కొత్త సంవత్సరంగా జరుపుకోవాలని ఆ రాష్ట్ర అసెంబ్లీ తీర్మానించింది. రాష్ట్ర గవర్నర్ ఈ తీర్మానానికి ఆమోదం చేసినా, చేయకున్నా తాము మాత్రం బెంగాలీ కొత్త సంవత్సరాన్ని జూన్ 20వ తేదీన జరుపుకోనున్నట్లు సీఎం మమతా బెనర్జీ తెలిపారు.

రాజ్‌భవన్‌లోనే దీక్ష చేసుకోండి

మమతకు గవర్నరు ఆహ్వానం

కోల్‌కతా: రాజ్‌భవన్‌లోనే ధర్నా చేయడానికి రావాల్సిందిగా ముఖ్యమంత్రి మమతా బెనర్జీకి పశ్చిమబెంగాల్ గవర్నరు సీవీ ఆనందబోస్ గురువారం ఆహ్వానించారు. మమతను తన గౌరవ అతిథిగా భావిస్తానని చెప్పారు. మమత కోరుకుంటే రాజ్‌భవన్ లోపలే నిరసన తెలపవచ్చని పేర్కొన్నారు. అసెంబ్లీ ఆమోదించిన బిల్లులు గవర్నరు నుంచి రాకపోవడంతో...రాజ్‌భవన్ వెలుపల ధర్నా చేస్తానని మమత హెచ్చరించడంపై గవర్నరు పైవిధంగా స్పందించారు. 'రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్న సహచరురాలు, గౌరవ ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేస్తున్నా. మీరు కోరుకుంటే రాజ్‌భవన్ లోపలే నిరసనకు దిగవచ్చు. మీరు రాజ్‌భవన్ బయట కూర్చోవాల్సిన అవసరం ఏముంది' అని ఇక్కడ విమానాశ్రయంలో విలేకరులతో మాట్లాడుతూ గవర్నరు అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ హక్కులను లాక్కోవడం ద్వారా పాలనలో జోక్యం చేసుకోవడానికి ప్రయత్నిస్తే రాజ్‌భవన్ వెలుపల ధర్నా చేయాల్సి వస్తుందని మమత హెచ్చరించారు. అన్యాయాన్ని అంగీకరించే ప్రసక్తేలేదని, ఎలా పోరాడాలో బెంగాల్‌కు బాగా తెలుసునని మమత అన్నారు. చాన్సలర్ హోదాలో రాష్ట్రంలోని 8 యూనివర్సిటీల వైస్ చాన్సలర్లను గవర్నరు నియమించారు. ముఖ్యమంత్రితో కనీసం సంప్రదింపులు లేకుండానే ఏకపక్షంగా ఆయన నియామకాలు చేపట్టారు. దీనిపై మమత మండిపడ్డారు. మరో 8 యూనివర్సిటీల వైస్‌చాన్సలర్ల పేర్లు ఖరారయ్యాయని, త్వరలోనే నియామక లేఖలు అందజేయనున్నట్లు రాజ్‌భవన్ వర్గాలు పేర్కొన్నాయి. రాష్ట్ర ప్రభుత్వ సూచనలు సైతం తీసుకోకుండా గవర్నరు ఏకపక్షంగా నియామాలు చేశారని మమత ఆరోపించారు.

జీ20 అతిథుల కోసం

చాందినీ చౌక్ మార్కెట్‌లో మహిళా అనువాదకర్తలు

న్యూఢిల్లీ: జీ20 శిఖరాగ్ర సదస్సు కోసం దిల్లీవ్యాప్తంగా విస్తృతస్థాయిలో ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇందుకోసం వచ్చే విదేశీ అతిథులు స్థానిక మార్కెట్లను సందర్శించే క్రమంలో వారితో మాట్లాడేందుకు ఆంగ్లం, ఫ్రెంచ్, స్పానిష్‌తో పాటు ఇతర భాషలను అనర్గళంగా మాట్లాడగలిగే 100 మంది మహిళా అనువాదకర్తలను వ్యాపారులు రంగంలోకి దించారు. ఈ మేరకు చాంబర్ ఆఫ్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ (సీటీఐ) చైర్మన్ బ్రిజేశ్ గోయల్ గురువారం తెలిపారు. ఎంట్రప్రెన్యూర్‌లు, ఫ్యాషన్ డిజైనర్లు, ఇన్‌ఫ్లుయన్సర్లు, బ్లాగర్లు, సలూన్, బుటిక్ ఓనర్లను సీటీఐ భాగస్వామ్యం చేసుకున్నట్లు చెప్పారు. వలంటీర్లలో ప్రముఖ ఎంట్రప్రెన్యూర్‌లు, వ్యాపారవేత్తలు మోహిక సాన్వే, ఎమిలి మున్ని, గౌరి వెబ్‌స్టర్, వందనా రావు, ఛాయా సింగ్, నీరూ సెహగల్, స్వేతా రాజ్‌పాల్ తదితరులు ఉన్నట్లు వెల్లడించారు. ఇతర మార్కెట్ల వర్తకులకు ఇదే తరహా సాయం అందించేందుకు వలంటీర్లను ఏర్పాటు చేయాలని విదేశీ వ్యవహారాల శాఖను సీటీఐ కోరిందని గోయల్ చెప్పారు. ఆహారం, షాపింగ్‌కు చాందినీ చౌక్ ప్రసిద్ధి. చారిత్రక కట్టడాలు ఉండటంతో సందర్శకుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. అనువాదకర్తలను ద్వారా విదేశీ అతిథులతో మాట్లాడే వీలు కలుగుతుండటంపై వ్యాపారులు సంతృప్తిని వ్యక్తంచేశారు. చాందినీచౌక్ గురించి ప్రపంచానికి తెలియజేయడమే తమ ఉద్దేశమని, ఇందుకు అనువాదకర్తలు దోహదమవుతున్నట్లు తెలిపారు. కాగా, ప్రగతి మైదాన్‌లో ఈనెల 9, 10 తేదీల్లో జీ20 శిఖరాగ్ర సదస్సు జరగనుండటం విదితమే.

జర్నలిస్టుల రక్షణ చట్టం కోసం కమిటీ

పాత్రికేయులకు సీఎం చౌహాన్ వరాలు

భోపాల్: ఎన్నికల సమీపిస్తున్న వేళ మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ జర్నలిస్టులపై వరాల జల్లు కురిపించారు. జర్నలిస్టుల రక్షణ చట్టం రూపొందించేందుకుగాను కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. చౌహాన్ గురువారం జర్నలిస్టులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. పాత భవనం స్థానంలో కొత్తగా పత్రికా భవన్ నిర్మిస్తామని హామీ ఇచ్చారు. దీనిని రాష్ట్ర మీడియా సెంటర్‌గా పిలుస్తామని, ఇందులో అధునాతన కన్వెన్షన్ సెంటర్, లైబ్రరీ, క్యాంటీన్ వంటి సదుపాయాలు కల్పిస్తామని చౌహాన్ తెలిపారు. రాష్ట్ర జర్నలిస్టుల రక్షణ చట్టం రూపొందించడానికి సీనియర్ జర్నలిస్టులతో కమిటీ ఏర్పాటు చేస్తామని, చట్టం రూపకల్పనపై కమిటీ సిఫార్సులు చేస్తుందని వివరించారు. 60 ఏళ్లు దాటిన సీనియర్ జర్నలిస్టులకు నెలకు ఇచ్చే గౌరవ వేతనం రూ.10 వేల నుంచి రూ.20 వేలకు పెంచుతామని హామీ ఇచ్చారు. మృతిచెందిన జర్నలిస్టు కుటుంబాలకు రూ.8 లక్షల సాయం అందిస్తామని సీఎం చెప్పారు. అక్రిడిటేషన్ గల జర్నలిస్టులకు ఇళ్ల నిర్మాణం కోసం ప్రస్తుతం అందజేస్తున్న రూ.25 లక్షల రుణాన్ని రూ.30 లక్షలకు పెంచుతామని, జర్నలిస్టుల ఆరోగ్య బీమా కోసం పూర్తిస్థాయి ప్రీమియం ప్రభుత్వమే చెల్లిస్తుందని చెప్పుకొచ్చారు. జర్నలిస్టులకు సాధారణ వ్యాధులకు అందజేసే సాయాన్ని రూ.20 వేల నుంచి రూ.40 వేలకు పెంచుతామని, తీవ్రమైన జబ్బులకు రూ.50 వేల నుంచి రూ.లక్షకు పెంచుతామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. జర్నలిస్టుల పిల్లల చదువుల కోసం ఇచ్చే రుణాల్లో ఐదుశాతం సబ్సిడీ అందజేస్తామన్నారు. మఖన్‌లాల్ చతుర్వేది నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ జర్నలిజం, కమ్యూనికేషన్ తోడ్పాటుతో డిజిటల్ టెక్నాలజీ రంగంలో జర్నలిస్టులకు శిక్షణ అందిస్తామన్నారు. ఇళ్ల నిర్మాణం కోసం జర్నలిస్టు సొసైటీలకు జిల్లాస్థాయిలో భూమి ఇస్తామన్నారు.

అలాంటప్పుడు ఆచితూచి వ్యవహరించాలి

అన్ని న్యాయస్థానాలకు సుప్రీంకోర్టు సూచన

న్యూఢిల్లీ: సరైన వివరణ లేనప్పుడు, ఎఫ్ఐఆర్ నమోదులో జాప్యం జరిగినప్పుడు ప్రాసిక్యూషన్ కథనం అలంకారపూరితంగా తోచినప్పుడు సాక్ష్యాధారాలను నిశితంగా పరిశీలించాల్సిన అవసరం, ఆచితూచి చర్యలు తీసుకోవడం కోర్టులకు ముఖ్యమని సర్వోన్నత న్యాయస్థానం నొక్కిచెప్పింది. 1989లో హత్యా నేరం కింద యావజ్జీవ శిక్ష పడిన ఇద్దరు దోషులకు సుప్రీంకోర్టు విడుదల చేసింది. జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఈ వ్యవహారాన్ని పరిశీలించింది. 1989, ఆగస్టు 25న ఓ వ్యక్తిని హత్య చేసిన కేసులో దోషులుగా ఈ ఇద్దరు ఉన్నట్లు గుర్తించింది. ఘటన జరిగిన మరుసటి రోజు బిలాస్‌పూర్ జిల్లాలో ఎఫ్ఐఆన్ నమోదైంది.

అయితే ఎఫ్ఐఆర్ నమోదు ఆలస్యమై సరైన వివరణ లేనప్పుడు కోర్టులు చాలా జాగ్రత్తగా సాక్ష్యాధారాలను పరిశీలించాలని, ప్రాసిక్యూషన్ కథనాన్ని గుడ్డిగా నమ్మకూడదని కోర్టులకు (ఈనెల 5న ఇచ్చిన తీర్పులో) సర్వోన్నత న్యాయస్థానం తేల్చిచెప్పింది. ఫిర్యాదిదారులు హరిలాల్, 2010 ఫిబ్రవరిలో చత్తీస్‌గఢ్ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ హరిలాల్, పారస్‌రామ్ చేసుకున్న వేర్వేరు ఫిర్యాదులను సుప్రీంకోర్టు విచారించింది. 1991 జులైలో విచారణ కోర్టు వీరిద్దరిని దోషులుగా తేల్చి యావజ్జీవ శిక్ష విధించగా, హైకోర్టు కూడా సమర్థించింది. వీటిని సుప్రీంకోర్టులో తాజాగా సవాల్ చేయగా ఫిర్యాదుదారులకు విముక్తి లభించింది.

ట్రాఫిక్ సమస్య లేకుండా చర్యలు

పోలీసులకు మంత్రి భరద్వాజ్ సూచనలు

న్యూఢిల్లీ: జీ-20 సదస్సు కోసం అభివృద్ధి చేస్తున్న ఆస్తులకు నగర పోలీసులు రక్షణ కల్పించాలని ఢిల్లీ పట్టణాభివృద్ధి శాఖమంత్రి సౌరభ్ భరద్వాజ్ స్పష్టంచేశారు. కీలకమైన ఈ సదస్సు పూర్తయిన తర్వాత ఆ ఆస్థులు అపహరణకు గురికాకుండా లేదా ధ్వంసం కాకుండా కాపాడాల్సిన బాధ్యత పోలీసులదేనని ఆయన చెప్పారు. మంత్రి భరద్వాజ్ గురువారం పీటీఐకి ఫోన్ ద్వారా ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ విషయాలు వెల్లడించారు. ప్రజలు అసౌకర్యానికి గురికాకుండా ఇలాంటి కార్యక్రమాలను ప్రణాళికాబద్ధంగా చేయాల్సి ఉందని మంత్రి భరద్వాజ్ చెప్పారు. 'జీ-20 వంటి సదస్సులు ఢిల్లీలో జరగడం మంచిది. అయితే అప్రమత్తత అవసరం. గడచిన పది రోజులుగా ప్రజలు ట్రాఫిక్ సమస్యను ఎదుర్కొంటున్నారు. ఇలాంటి కార్యక్రమాల నిర్వహణ కోసం ప్రజల మద్దతు కావాలంటే...వారికి అసౌకర్యం లేకుండా చూడాల్సిన అవసరం ఉంది. అందుకోసం ఢిల్లీ పోలీసులకు సరైన ప్రణాళిక తప్పనిసరి. ట్రాఫిక్ విధులు నిర్వహించే విభాగం మరింత అప్రమత్తంగా ఉండాలి' అని మంత్రి చెప్పారు. జీ-20 సదస్సు కోసం ఢిల్లీలో సృష్టిస్తున్న సంపద అపహరణకు గురికాకుండా చూడాల్సిన బాధ్యత పోలీసులదేనన్నారు. ఢిల్లీ సుందరీకరణ కోసం నిధుల కేటాయింపుపై వివాదం నడుస్తున్న విషయం విదితమే. తన 9 ఏళ్ల పాలనలో ఆప్ ప్రభుత్వం ఢిల్లీ అభివృద్ధికి చేసిందేమీ లేదని కేంద్రమంత్రి మీనాక్షి లేఖి సోమవారం ఆరోపించారు. నగరంలో జీ-20 సదస్సు ఏర్పాట్ల కోసం కేంద్ర ప్రభుత్వమే మొత్తం వెచ్చిస్తోందని చెప్పారు. ఈ ఆరోపణలపై భరద్వాజ్ స్పందిస్తూ సదస్సు నేపథ్యంలో నిధులు కేటాయించాల్సిన బాధ్యత కేంద్రానికి లేదా అని ప్రశ్నించారు.

తమ సొంత నిధులు వెచ్చించేలా అన్ని శాఖలను ఆదేశించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి తాను స్వయంగా లేఖ రాశానని ఆయన చెప్పారు. జీ-20 సదస్సుకు నిధుల కోసం కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌కు మనీశ్ సిసోదియా లేఖ రాశారని గుర్తుచేశారు. అయినా కేంద్రం నుంచి స్పందన లేదని ఆరోపించారు. ఢిల్లీ నగరంపై కేంద్రం సవతి తల్లి ప్రేమ చూపుతోందన్నారు. కేంద్రం నిధులు ఇచ్చినా...ఇవ్వకపోయినా పనులు ఆపవద్దని ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఆదేశించినట్లు భరద్వాజ్ వెల్లడించారు. ఒకవేళ ఢిల్లీలో వర్షాలు కురిసినా వరద సమస్య ఉండబోదని తెలిపారు.

భారత్ జోడోయాత్ర గొప్ప ప్రజాఉద్యమం

భారతీయుల మనస్సులు కలిపే ప్రయత్నం: ఖడ్గే

న్యూఢిల్లీ: భారత్ జోడో యాత్రను ప్రజాఉద్యమంగా కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖడ్గే గురువారం అభివర్ణించారు. పాదయాత్ర అనేది భౌతిక కసరత్తు మాత్రమే కాదని, అందరి మనస్సులను చిత్తశుద్ధితో కలిపే ప్రయత్నమని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్ర చేపట్టి ఏడాది పూర్తయిన సందర్భంగా ఖడ్గే దీనిపై స్పందించారు. సమాజంలో విద్వేషాలకు స్వస్తి పలికేంత వరకూ భారత్ జోడో యాత్ర కొనసాగుతోందని ఆయన స్పష్టంచేశారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత విద్వేషం, ప్రతీకారం వంటి మహమ్మారి దేశాన్ని ఆవరించిందని, దీనిని తొలగించి భారతీయులందరినీ ఒక్కటి చేసేందుకు యాత్ర చేస్తామని ఖడ్గే తెలిపారు. న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం అత్యంత ముఖ్యమైనవని, వాటి కోసం అహర్నిశలు పోరాడతామని సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ఖడ్గే పేర్కొన్నారు. రాజ్యాంగం, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరు సాగిస్తుందని, ఇందుకోసం ప్రజలతో మమేకమవుతోందని తెలిపారు. 2022 సెప్టెంబరు 9వ తేదీన తమిళనాడులోని కన్యాకుమారి నుంచి కాంగ్రెస్ భారత్ జోడో యాత్ర ప్రారంభించింది. 'వాస్తవిక సమస్యల నుంచి ప్రజల దృష్టి మరల్చడానికి కేంద్రం నిరంతరం కుట్ర చేస్తోంది. అందులో భాగంగానే సంబంధం లేని అంశాలను ఎప్పటికప్పుడు తెరపైకి తెస్తోంది. విద్వేషం, విభజన రాజకీయాల రహస్య అజెండాను ప్రజల్లోకి రాకుండా చూడటానికి నిత్యం కేంద్రం దాడి చేస్తోంది' అని ఖడ్గే విమర్శించారు. ఆర్థిక అసమానతలు, ధరల పెరుగుదల, నిరుద్యోగం, సామాజిక న్యాయం, రాజ్యాంగ పరిరక్షణ, అధికార వికేంద్రీకరణ వంటి వాస్తవిక సమస్యలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే యాత్ర లక్ష్యమని పేర్కొన్నారు. భారత్ జోడో యాత్ర గొప్ప ప్రజాఉద్యమమని ఆయన స్పష్టంచేశారు. 'భారత్ జోడోయాత్ర పూర్తయి ఏడాది గడిచిన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ తరపున రాహుల్‌గాంధీకి, యాత్రలో పాల్గొన్న లక్షలాదిమంది ప్రజలు, యాత్రికులకు ధన్యవాదాలు తెలుపుతున్నాను' అని ఖడ్గే పేర్కొన్నారు.

ఇక 'భారత్ జోడో లీడర్‌షిప్': యూత్ కాంగ్రెస్

న్యూఢిల్లీ: వచ్చే ఏడాది జరిగే లోక్‌సభ ఎన్నికల్లో యువత చురుగ్గా పాల్గొనేలా చైతన్యపరిచేందుకు భారత యువజన కాంగ్రెస్ (ఐవైసీ) గురువారం 'భారత్ జోడో నాయకత్వం' కార్యక్రమాన్ని ప్రారంభించింది. భారత్ జోడో యాత్ర ప్రారంభించి ఏడాది గడిచిన సందర్భంగా ఐవైసీ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించింది. కాగా వచ్చే మూడు నెలల్లో భారత్ జోడో యాత్రను జరుపుకోవడానికి ఐవైసీ వివిధ కార్యక్రమాలను కూడా నిర్వహించనుంది. వీటిలో పాదయాత్ర, సాంస్కృతిక కార్యక్రమాలు, ఫోటో ఎగ్జిబిషన్, క్రీడా కార్యక్రమాలు, రక్తదాన శిబిరాలు ఉంటాయి. అఖిల భారత కాంగ్రెస్ కమిటీ ఆదేశాల మేరకు యువజన కాంగ్రెస్ అధ్వర్యంలో రాష్ట్ర, జిల్లా స్థాయిలో భారత్ జోడో పాదయాత్ర నిర్వహించి... రాష్ట్ర, జిల్లా స్థాయిలో 'మొహబ్బత్ కీ దుకాన్' ఏర్పాటు చేసి సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఐవైసీ ఓ ప్రకటనలో తెలిపింది.

వాతావరణం, ఇంధన ఫలితాలపైనే ఆశలు

ఎండీబీ సంస్కరణలపై ఏకాభిప్రాయం సాధించాలంటున్న నిపుణులు

న్యూఢిల్లీ: భారతదేశం అధ్యక్షతన న్యూఢిల్లీలో జరిగే జీ20 శిఖరాగ్ర సదస్సుకు ప్రపంచ నేతలు హాజరవుతున్న తరుణంలో బహుళ విధ అభివృద్ధి బ్యాంకు (ఎండీబీ) సంస్కరణలపై ఏకాభిప్రాయాన్ని సాధించాలని, ఘన శిలాజ ఇంధనాల నిర్మూలనకు సంబంధించి కఠిన నిర్ణయాలు తీసుకోవాలని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. తద్వారా భారతదేశ నాయకత్వ పాత్ర మెరుగుపడేందుకు దోహదం చేస్తుందని పేర్కొంటున్నారు. ప్రపంచ జీడీపీలో 85 శాతం వాటా ఉన్న జీ20 దేశాలు... 80 శాతం ఉద్గారాలకు కారణమవుతున్నాయి. జులైలో జరిగిన ఇంధన, వాతావరణ మంత్రుల సమావేశాలలో శిలాజ ఇంధనాల నిరంతరాయ వినియోగాన్ని తగ్గించడం, 2030 నాటికి పునరుత్పాదక శక్తిని మూడు రెట్లు అంటే 11 టెరావాట్‌ల సామర్థ్యానికి పెంచడం, అభివృద్ధి చెందుతున్న దేశాలకు తక్కువ వడ్డీకి రుణాలు అందించడంపై ఏకాభిప్రాయం సాధించడంలో విఫలమయ్యాయి. ప్రపంచ సగటు ఉష్ణోగ్రత పెరుగుదలను 1.5 డిగ్రీల సెల్సియస్‌కు పరిమితం చేయడంలో ఇవి కీలకమైన సమస్యలు. శక్తి పరివర్తన, ఎండీబీ సంస్కరణలపై జరిగిన జరిగిన చర్చల్లో అనిశ్చితులు, సంక్లిష్టత ఉన్నప్పటికీ సదస్సుకు హాజరయ్యే నాయకులు ఐక్యతను ప్రదర్శించడానికి ఏకాభిప్రాయాన్ని కనుగొనగలరన్న ఆశలున్నాయి. బొగ్గు వినియోగాన్ని తగ్గించడానికి ప్రపంచ దేశాలు అంగీకరించాలని భారతదేశం భావిస్తోంది. అయితే ఈ అంశం సదస్సు ఆమోదించే తుది జాబితాలో లేనట్లయితే... బొగ్గు వినియోగంపై గత సంవత్సరం బాలి శిఖరాగ్ర సమావేశంలో కుదిరిన అంగీకారం వెనక్కుపోయే ప్రమాదం ఉంది. జీ-20 ఇంధన మంత్రుల సమావేశంలో శిలాజ ఇంధనాల వాడకాన్ని తగ్గించే ప్రయత్నాలపై వ్యతిరేకతకు సౌదీ అరేబియా నాయకత్వం వహించింది. అయితే జీ7 దేశాలు శిలాజ ఇంధనాలను తగ్గించే ప్రక్రియను వేగవంతం చేయడానికి గతంలోనే కట్టుబడ్డాయి. ఐరాస వాతావరణ చర్చల అధ్యక్షుడు సుల్తాన్ అల్ జాబర్ మాట్లాడుతూ... శిలాజ ఇంధనాల నివారణ అనివార్యమే అయినా... ప్రపంచవ్యాప్తంగా పునరుత్పాదక శక్తి సామర్థ్యంలో గణనీయమైన పెరుగుదలపై ఇది ఆధారపడి ఉంటుందని స్పష్టం చేశారు. అయితే... నిపుణులు మాత్రం జీ20లో శిలాజ ఇంధన చర్చలపై చెప్పుకోదగ్గ పురోగతి ఉండకపోవచ్చని అభిప్రాయపడుతున్నారు. ది ఎనర్జీ అండ్ రిసోర్సెస్ ఇన్‌స్టిట్యూట్‌లో ప్రోగ్రామ్ డైరెక్టర్ ఆర్ఆర్ రష్మి మాట్లాడుతూ... "సాంకేతికత, హైడ్రోజన్, బ్లూ ఎకానమీ, వృత్తాకార ఆర్థిక వ్యవస్థపై భారతదేశం ముందుకు వచ్చినప్పటికీ శిలాజ ఇంధనాల సమస్యపై ప్రపంచ పురోగతి, నిర్దిష్ట చర్యలు లేకపోవడం వల్ల బాలిలో అంగీకరించిన దానికి అదనంగా నిర్ణయాలు జరిగే అవకాశం లేదు" అన్నారు. అభివృద్ధి చెందిన దేశాలు మరింత బాధ్యత తీసుకుని... అన్ని శిలాజ ఇంధనాల వినియోగాన్ని తగ్గించుకునేందుకు సమానత్వం కోసం కృషి చేయాలని, ప్రభుత్వ మరియు ప్రభుత్వేతర పర్యావరణ సంస్థల గ్లోబల్ నెట్‌వర్క్ అయిన క్లైమేట్ యాక్షన్ నెట్‌వర్క్ (సీఏఎన్) ఇంటర్నేషనల్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న ఇంద్రజిత్ బోస్ అభిప్రాయపడ్డారు. ప్రపంచ లక్ష్యాలను భేదం లేకుండా వర్తింపజేసినప్పుడు అభివృద్ధి చెందుతున్న దేశాలపై ముఖ్యంగా వేగం గా విద్యుత్ డిమాండ్ వేగంగా పెరుగుతున్న దేశాలపై అసమాన భారం పడుదుందని బెంగుళూరులోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ స్టడీస్‌లో అసోసియేట్ ప్రొఫెసర్ తేజల్ కనిత్కర్ అభిప్రాయపడ్డారు. సంబంధిత సామర్థ్యాల సూత్రాల ద్వారా స్పష్టమైన నిబద్ధత ఉంటే తప్ప అభివృద్ధి చెందుతున్న దేశాలు ఏ ప్రపంచ లక్ష్యాన్ని వెంటనే అంగీకరించకూడదని ఆమె అన్నారు. వాతావరణ లక్ష్యాలను చేరుకునేలా మార్కెట్ సరైన దిశలో కదలడానికి బలమైన సంకేతాలు అవసరమని, జీ20 సదస్సులో ఫైనాన్స్‌పై అర్థవంతమైన పురోగతిని సాధించలేకపోతే అది ఆందోళనకరమని విద్యుత్, పర్యావరణం, నీటిపై స్వతంత్ర థింక్ ట్యాంక్ కౌన్సిల్ (సీఈఈడబ్ల్యు) ప్రతినిధి వైభవ్ చతుర్వేది పేర్కొన్నారు. వాతావరణ మార్పుల ప్రభావాలను పరిష్కరించడానికి, వారి వాతావరణ లక్ష్యాలను సాధించడానికి అభివృద్ధి చెందుతున్న దేశాలకు కేటాయించిన నిధులలో ఎక్కువ భాగం గ్రాంట్లు కాకుండా రుణాలు లేదా పెట్టుబడుల రూపంలో అందించబడతాయి... అంటే ఆయా దేశాలు దానిని తిరిగి చెల్లించవలసి ఉంటుంది. డబ్బు ఎక్కువగా అవసరమైన దేశాలు దానిని తిరిగి చెల్లించలేకపోవడమే సమస్య అని నిపుణులు అంటున్నారు. 2011-20 కాలంలో చూసినట్లయితే వాతావరణ నిధుల్లో కేవలం 5 శాతం గ్రాంట్‌లుగా పంపిణీ చేయబడింది. మిగిలినవి రుణాలు లేదా ఈక్విటీగా ఏర్పాటు చేయబడ్డాయి. ముఖ్యంగా... దశాబ్దంలో మొత్తం వాతావరణ నిధుల్లో 75 శాతం ఉత్తర అమెరికా, పశ్చిమ ఐరోపా, తూర్పు ఆసియా, పసిఫిక్‌లో కేంద్రీకృతమై ఉన్నాయి. శాన్ ఫ్రాన్సిస్కోలో ప్రధాన కార్యాలయాన్ని కలిగి ఉన్న స్వతంత్ర వాతావరణ విధాన సంస్థ క్లైమేట్ పాలసీ ఇనిషియేటివ్ (సీపీఐ) విడుదల చేసిన డేటా ప్రకారం... తక్కువ, మధ్య ఆదాయ దేశాలలో అధిక ప్రాంతాలు వాతావరణ నిధుల్లో 25 శాతం కంటే తక్కువ పొందాయి. 'అభివృద్ధి చెందుతున్న దేశాలకు మరింత ఆర్థిక సాయం, పునరుత్పాదక ఇంధన లక్ష్యాలను మూడు రెట్లు పెంచడం, శిలాజ ఇంధనాలను తొలగించడం అన్నీ పరస్పరం అనుసంధానించబడిన సమస్యలు. వీటిపై ప్రతిష్ఠాత్మకమైన ప్రకటన చేయబడితే జీ20 కూటమికి అధ్యక్షత వహిస్తున్న భారతదేశ ప్రతిష్ఠ ఇనుమడిస్తుంది' అని ఇంటర్నేషనల్ ఫోరమ్ ఫర్ ఎన్విరాన్‌మెంట్, సస్టెయినబిలిటీ అండ్ టెక్నాలజీ (ఐఫారెస్ట్) సీఈఓ చంద్రభూషణ్ అన్నారు. అయితే, దేశాలు ఎంత ఉద్గారాలను తగ్గిస్తున్నాయి... ఐపీసీసీ లక్ష్యాలు నెరవేరుతాయా లేదా అనే దానిపై మాత్రమే సదస్సు విజయాన్ని సూచిస్తుందని ఆయన అన్నారు.

చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యం పెరగాలి

- మహిళలకు శ్రమకు తగిన గుర్తింపు లేదు
- చిత్తూరు సదస్సులో రామకృష్ణ

విశాలాంధ్ర-చిత్తూరు: చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యం పెరగాల్సిన అవసరం ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ఆకాంక్షించారు. రాష్ట్రాన్ని రక్షించండి-దేశాన్ని కాపాడండి నినాదంతో చేపట్టిన సీపీఐ బస్సుయాత్ర గురువారం జిల్లా కేంద్రమైన చిత్తూరు చేరుకుంది. 'మహిళా సాధికారత-పాలకుల నిర్లక్ష్యం' అనే అంశంపై మహిళా సదస్సు జరిగింది. రామకృష్ణ మాట్లాడుతూ మహిళా రిజర్వేషన్ బిల్లు ఏళ్ల తరబడి పార్లమెంటులో ఆమోదం పొందక పోవడం దురదృష్టకరమన్నారు. మహిళల ఎదుగుదలను రాజకీయ పార్టీలు అంగీకరించలేకపోతున్నాయని విమర్శించారు. శ్రమకు తగిన గుర్తింపు మహిళకు దక్కడం లేదన్నారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పిస్తామంటూ హామీలు గుప్పించి అధికారంలోకి వచ్చిన అనేక పార్టీలు...మాట నిలబెట్టుకోలేకపోతున్నాయని ఆరోపించారు. దేశంలో 14 శాతం మంది మహిళలు మాత్రమే చట్టసభల్లో ఉన్నారన్నారు. చట్టసభల్లో 50 శాతం పైగా మహిళలు ఉన్న దేశాలు అనేక రంగాలుగా దూసుకుపోతున్నాయని చెప్పారు. దేశంలో మహిళలపై అత్యాచారాలు, దాడులు ఆగడంలేదని, వీటిని అరికట్టడంలో మోదీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. మణిపూర్ ఘటనతో దేశం అట్టుడికి పోయినా కేంద్ర ప్రభుత్వంలో చలనం లేకపోవడం విచారకరమన్నారు. ఇలాంటి ప్రభుత్వాలకు పాలించే అర్హత లేదన్నారు.

రాష్ట్రంలో అభివృద్ధి పడకేసిందని, పారిశ్రామికంగా వెనుకబడిందని రామకృష్ణ విమర్శించారు. తద్వారా ఉపాధి అవకాశాలు కరువయ్యాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి మార్గాలు చూపకుండా, పరిశ్రమలు ఏర్పాటు చేయకుండా బటన్ నొక్కడం సమంజసం కాదని హితవు పలికారు. దేశం అభివృద్ధి చెందాలంటే మహిళల్లో చైతన్యం రావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చే ఉచిత హామీలు నమ్మి మోసపోవద్దని, దీనివల్ల జరిగే అనర్థాలకు మనమే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఎండగడుతూ ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి సీపీఐ బస్సుయాత్ర చేపట్టినట్లు వివరించారు. సదస్సుకు అధిక సంఖ్యలో మహిళలు తరలిరావడం గొప్ప విషయమన్నారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ మాట్లాడుతూ చట్టసభల్లో మహిళలకు తగిన ప్రాధాన్యత దక్కకపోవడం శోచనీయమన్నారు. స్వాతంత్ర్య సంగ్రామంలో మహిళలు కీలకపాత్ర పోషించారన్నారు. రానున్న పార్లమెంటు సమావేశాలలో మహిళా రిజర్వేషన్ బిల్లును ఆమోదించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. మణిపూర్ దుర్మార్గాలపై సుప్రీంకోర్టు జోక్యం చేసుకునే వరకూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కదలలేదని విమర్శించారు. మహిళా చట్టాలు సక్రమంగా అమలు కావడం లేదన్నారు. మహిళా సాధికారతకు ప్రభుత్వాలు చిత్తశుద్ధితో పనిచేయాలని డిమాండ్ చేశారు. ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గా భవాని మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల శ్రమను దోచుకుంటున్నాయని మండిపడ్డారు. మహిళలకు తగిన ప్రాధాన్యత ఇవ్వడంలో పూర్తిగా విఫలమయ్యాయని ధ్వజమెత్తారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు డి.జగదీశ్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల హక్కులను హరిస్తున్నాయన్నారు. సదస్సులో సీపీఐ రాష్ట్ర సహాయకార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్ర నాయక్, పెంచలయ్య, సీపీఐ చిత్తూరు జిల్లా కార్యదర్శి నాగరాజు, మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు జయలక్ష్మి, వర్కింగ్ ప్రెసిడెంట్ విమల, సీపీఐ నేత గోపీనాథ్, ప్రజానాట్య మండలి కళాకారులు, మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

చిత్తూరులో భారీ ర్యాలీ

విశాలాంధ్ర -చిత్తూరు: రాష్ట్రాన్ని రక్షించండి- దేశాన్ని కాపాడండి నినాదంతో సీపీఐ చేపట్టిన బస్సుయాత్రకు చిత్తూరులో ఘనస్వాగతం పలికింది. పెద్దసంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు స్వాగతం పలికారు. బస్సుయాత్ర చిత్తూరు శివారుకు చేరుకోవడంతో మహిళలు ఎదురెల్లి...సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణకు తిలకం దిద్ది హారతుల పట్టారు. రామకృష్ణతో పాటు సీపీఐ నాయకులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అక్కడ నుంచి ప్రజానాట్యమండలి డప్పు కళాకారుల విప్లవ గీతాల మధ్య భారీ స్కూటర్ ర్యాలీ జరిగింది. ర్యాలీ అంబేద్కర్ విగ్రహం నుంచి దర్గా సర్కిల్, గాంధీ విగ్రహం, ఆర్టీసీ బస్టాండ్ మీదుగా ఎస్‌పీఎస్ హోటల్ వరకు కొనసాగింది. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా అధిక సంఖ్యలో కార్యకర్తలు, నేతలు తరలివచ్చారు. నినాదాలతో నగరం హోరెత్తింది. ఎర్రజెండాలు రెపరెపలాడాయి. సీపీఐ చిత్తూరు జిల్లా కార్యదర్శి నాగరాజు అధ్వర్యంలో ర్యాలీ కొనసాగింది. బస్సుయాత్రకు విశేష స్పందన రావడంతో సీపీఐ కార్యకర్తల్లో ఉత్సాహం నెలకొంది.

వైసీపీకి గుణపాఠం తప్పదు

ప్రతిపక్షాల సభలకు అడ్డంకులా: పుంగనూరులో రామకృష్ణ

విశాలాంధ్ర-పుంగనూరు: పుంగనూరు, అంగళ్ల ఘటనలు అధికార పార్టీ అహంకారాన్ని రుజువు చేస్తున్నాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. దేశాన్ని కాపాడండి-రాష్ట్రాన్ని రక్షించండి నినాదంతో ప్రారంభమైన సీపీఐ బస్సుయాత్ర గురువారం పుంగనూరు చేరుకుంది. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి టి.జనార్దన్ నేతృత్వంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు బస్సుయాత్రకు ఘనస్వాగతం లభించింది. రామకృష్ణ ఇక్కడ మీడియా సమావేశంలో మాట్లాడుతూ పుంగనూరును తమ జాగీరుగా అధికారపార్టీ భావిస్తోందని, అందుకే ప్రతిపక్షాల సభలు, సమావేశాలపై ఉక్కుపాదం మోపుతోందని విమర్శించారు. అంగళ్లు, పుంగనూరు ఘటనల్లో 500 మందికి పైగా అమాయకులపై కేసులు బనాయించారని, 200 మందిని జైళ్లకు పంపారని చెప్పారు. ప్రభుత్వం త్వరలో మూల్యం చెల్లించక తప్పదని ఆయన హెచ్చరించారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదని, ప్రజాస్వామ్యంలో సభలు, సమావేశాలు నిర్వహించుకొనే హక్కు అందరికీ ఉందనే విషయం గుర్తుంచుకోవాలని హితవు పలికారు. వైసీపీ ప్రభుత్వ నిరంకుశత్వంపై త్వరలో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు రామకృష్ణ చెప్పారు. తెలుగుదేశం పార్టీకి సీపీఐ వత్తాసు పకలుకుతోందని కొంతమంది మతి భ్రమించి మాట్లాడుతున్నారని, బీజేపీపై దాడిచేసినా తాము ఖండిస్తామని వివరించారు. దోచుకోవడం, దాచుకోవడం విధానంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకెళుతోందని విమర్శించారు. సీఎం జగన్ హయాంలో రాష్ట్రంలో ఏ ఒక్క ప్రాజెక్టు పూర్తికాలేదని, ఒక్క పరిశ్రమ రాష్ట్రానికి రాలేదని ఆరోపించారు. యువతను మాదక ద్రవ్యాలకు బానిస చేస్తున్నారని మండిపడ్డారు. డ్రగ్స్ విషకౌగిలి నుంచి బయట పడి...ప్రభుత్వంపై తిరగబడాలని యువతకు పిలుపునిచ్చారు. సహజవనరులను ఎమ్మెల్యేలు, మంత్రులు ఇష్టానుసారం దోచుకుంటున్నారని చెప్పారు. దోచుకున్న డబ్బుతో రానున్న ఎన్నికల్లో గెలవడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి జగన్ రాష్ట్రానికి రాజధాని లేకుండా చేశారని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒంటెత్తు విధానాలు అవలంబిస్తున్నాయన్నారు. అన్ని పార్టీలు ఏకమై బీజేపీ, వైసీపీలను గద్దె దించాలని పిలుపునిచ్చారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి.ఈశ్వరయ్య, డి.జగదీశ్, జిల్లా సహాయ కార్యదర్శి టి.జనార్ధన్ పాల్గొన్నారు.

పలమనేరు రోడ్ షోకు నీరాజనం

విశాలాంధ్ర-పలమనేరు: రాష్ట్రాన్ని రక్షించండి- దేశాన్ని కాపాడండి నినాదంతో సీపీఐ చేపట్టిన బస్సుయాత్ర గురువారం పలమనేరు చేరుకుంది. స్థానిక సీపీఐ నాయకులు సుబ్రహ్మణ్యం, మంజునాథ్‌బాబు, సీపీఐ మాజీ నాయకుడు చెన్నకేశవులు తదితరులు సీపీఐ కార్యదర్శి రామకృష్ణకు, బస్సుయాత్రకు స్వాగతం పలికారు. పద్మశ్రీ సర్కిల్‌లో గల బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి రామకృష్ణ పూలమాల వేశారు. ఏఐఎస్ఎఫ్ విద్యార్థులు భారీ స్కూటర్ ర్యాలీతో రోడ్‌షో నిర్వహించారు. పలమనేరులో జరిగిన రోడ్‌షోకు ప్రజలు నీరాజనం పలికారు. అనంతరం ఆర్అండ్‌బీ అతిథి గృహంలో కొద్దిసేపు విశ్రాంతి తీసుకొని చిత్తూరు బయలుదేరి వెళ్లారు. రామకృష్ణ వెంట సీపీఐ రాష్ట్ర సహాయకార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి.ఈశ్వరయ్య, జగదీశ్, అక్కినేని వనజ, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్ర నాయక్, పెంచలయ్య, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జయలక్ష్మి, దుర్గా భవాని, మహిళా నేతలు పద్మావతి, విమల, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామాంజనేయులు, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి జనార్దన్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శివారెడ్డి, జాన్సన్‌బాబు, ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాజేంద్ర, లెనిన్‌బాబు, సంతోశ్, గురప్ప తదితరులు ఉన్నారు.

సీపీఐ ర్యాలీ, సభకు తిరుపతి ముస్తాబు

విశాలాంధ్ర- తిరుపతి: రాష్ట్రాన్ని రక్షించండి...దేశాన్ని కాపాడండి అన్న నినాదంతో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక పాలన పై ప్రజా చైతన్యం కోసం, ప్రజా సమస్యలే ప్రధాన అజెండా గా సీపీఐ నిర్వహిస్తున్న బస్సుయాత్రకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు బ్రహ్మరథం పట్టారు. శుక్రవారం బస్సు యాత్ర ముగింపు ర్యాలీ, బహిరంగ సభ తిరుపతిలో జరగనుంది. ఈ ర్యాలీ, బహిరంగ సభకు అన్ని ఏర్పాట్లు చురుకుగా సాగుతున్నాయి. మధ్యాహ్నం 2 గంటలకు బాలాజీ కాలనీ నుంచి భారీ ప్రదర్శన ప్రారంభం కానుంది. సాయంత్రం మూడు గంటలకు నెహ్రూ మున్సిపల్ హై స్కూల్ గ్రౌండ్ లో భారీ బహిరంగ సభ జరుగుతుంది. ఈ కార్యక్రమానికి తిరుపతి నగరంలో భారీ ఏర్పాట్లు చేశారు. ర్యాలీ జరిగే ప్రధాన రహదారులు, కూడళ్లలో పార్టీ కటౌట్లు, బ్యానర్లతో అలంకరించారు. నగరం మొత్తం సీపీఐ తోరణాలతో ఎరుపెక్కించారు. సభా ప్రాంగణంలో, వేదిక వద్ద చలువ పందిళ్లు, కుర్చీలు ఏర్పాటు చేశారు. బహిరంగ సభకు వచ్చే కార్యకర్తలకు భోజనాలు, తాగునీరు వంటివి ఏర్పాటు చేశారు. సభకు ముఖ్య అతిథులుగా సీపీఐ ప్రధాన కార్యదర్శి డి. రాజా, కార్యదర్శులు నారాయణ, వినయ్ విశ్వం, రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ తదితరులు హాజరుకానున్నారు. సభకు రాష్ట్ర నలుమూలల నుంచి పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో హాజరు కానున్నాయి. ఈ కార్యక్రమాలకు సంబంధించి ఏర్పాట్లను సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పి హరినాథరెడ్డి, కార్యవర్గ సభ్యులు రామానాయుడు, జిల్లా కార్యదర్శి మురళి, నగర కార్యదర్శి విశ్వనాథ్, కార్యవర్గ సభ్యులు, సమితి సభ్యులు గురువారం పర్యవేక్షించారు. ఈ ప్రదర్శన, బహిరంగ సభలో పాల్గొనేందుకు గురువారం ఉదయం నుంచే రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి పార్టీ శ్రేణులు బయలుదేరి వెళుతున్నారు.

జర్నలిస్టుల రక్షణకు
మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలి

ఐజేయూ జాతీయ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్): మీడియా రంగంలో పనిచేస్తున్న జర్నలిస్టులు, ఉద్యోగుల రక్షణకు తక్షణమే మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలని ఐజేయూ అధ్యక్షులు కే శ్రీనివాసరెడ్డి డిమాండ్ చేశారు. మీడియాలో పనిచేస్తున్న జర్నలిస్టుల భద్రతకు కేంద్ర ప్రభుత్వం ప్రతేక చట్టాన్ని రూపొందించాలని కోరారు. ఈ విషయమై అక్టోబర్ 2న గాంధీ జయంతి నాడు దిల్లీలోని జంతర్ మంతర్ వద్ద పెద్ద ఎత్తున జర్నలిస్టులతో సదస్సు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏపీయూడబ్ల్యూజే కార్యవర్గ సభ్యులతో జరిగిన 'గెట్ టు గెదర్' కార్యక్రమంలో శ్రీనివాసరెడ్డి మాట్లా డుతూ... జర్నలిస్టులపై జరుగుతున్న దాడులను దృష్టిలో పెట్టుకుని కేంద్రం ఒక చట్టం రూపొందిం చాలని ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు అనేక పర్యాయాలు ఐజేయూ విజ్ఞప్తి చేసిందన్నారు. అంతకుముందు మహారాష్ట్ర, చత్తీస్‌గఢ్ ప్రభుత్వాలు కూడా జర్నలిస్టుల పరిరక్షణకు వేర్వేరుగా చట్టాలు తీసుకొచ్చాయన్నారు. ఇలా ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రం విడివిడిగా చట్టాలు తీసుకురావడం కాకుండా మొత్తం దేశవ్యాప్తంగా వర్తింపజేసే విధంగా కేంద్ర ప్రభుత్వం చట్టం తీసుకురావాలని ఐజేయూ జాతీయ కార్యవర్గాలు తీర్మానం చేశాయన్నారు. మీడియాలో అనేక మార్పులు వచ్చాయని, ఎలక్ట్రానిక్ మీడియా ఆవిర్భావం తర్వాత ఇప్పుడు డిజిటల్ మీడియా కూడా వచ్చిందన్నారు. అందువల్ల మొత్తం పరిస్థితిని అవగాహన చేసుకుని దేశవ్యాప్తంగా మీడియా... దాని పరిణామాలు ఏంటి? మీడియారంగంలో ఉన్నవారి రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఏమిటనేది చర్చించడానికి వివిధ వర్గాలకు చెందిన మేధావులతో మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. దేశవ్యాప్తంగా ప్రెస్ కమిషన్ కాకుండా మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలని చాలాకాలంగా తాము విజ్ఞప్తి చేస్తున్నామని స్పష్టం చేశారు. ప్రెస్ కమిషన్ ఏర్పాటు చేయాలన్న సూచన మేరకే ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా వచ్చిందన్నారు. మొదటి ప్రెస్ కమిషన్‌లో సభ్యులుగా ఉన్నవారు ఆ తర్వాత కాలంలో ప్రధాన మంత్రులు, రాష్ట్రపతులు, ఉపరాష్ట్రపతులు అయ్యారని, రాజ్యాంగపరమైన కీలక పదవులను అధిష్ఠించారన్నారు. అందువల్ల మీడియా కమిషన్‌ను నిష్ణాతులైన ప్రముఖులతో ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. మంచి చెడులపై సమీక్ష జరపాలన్నారు. ఎలక్ట్రానిక్ మీడియా, డిజిటల్ మీడియాపై ఎలాంటి కట్టుబాట్లు లేవని... ప్రింట్ మీడియాకు మాత్రం ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఉందన్నారు. ఈ సమావేశంలో ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు ఐవీ సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి చందు జనార్ధన్, ఐజేయూ కౌన్సిల్ మెంబర్ ఎస్కే బాబు, ఏపీయూడబ్ల్యూజే విజయవాడ యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులు చావా రవి, కొండా రాజేశ్వరరావు, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు నిమ్మరాజు చలపతిరావు, కార్యదర్శి వసంత్ పాల్గొన్నారు.

గుండ్లకమ్మ ప్రాజెక్టు గేట్లకు మరమ్మతులు చేపట్టాలి

ఒంగోలులో ధర్నా

విశాలాంధ్ర-ఒంగోలు: గుండ్లకమ్మ ప్రాజెక్టు గేట్లు మరమ్మతులు వెంటనే చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ డిమాండ్ చేశారు. గుండ్లకమ్మ ప్రాజెక్టు గేట్లుకు వెంటనే మరమ్మతులు నిర్వహించి కాలువ చివరి భూముల వరకు నీరందించాలని డిమాండ్ చేస్తూ గుండ్లకమ్మ రైతు సంఘం ఆధ్వర్యంలో ప్రకాశం జిల్లా ఒంగోలు తహశీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. కేవీవీ ప్రసాద్ మాట్లాడుతూ గత సెప్టెంబర్‌లో గుండ్లకమ్మ ప్రాజెక్టు గేట్లు దెబ్బ తినడంతో నీళ్లు బయటకు వెళ్లిపోతున్నాయి, ప్రభుత్వం ఇప్పటికీ మరమ్మతులు చేపట్టలేదన్నారు. మరమ్మతులు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆందోళన చేయడంతో మంత్రులు, ప్రజాప్రతినిధులు పరిశీలించి మరమ్మతులు చేస్తామని హామీ ఇచ్చారే తప్ప దానిని పట్టించుకోలేదన్నారు. ఇప్పటికీ నీళ్లు వృథాగా కిందకు వెళ్తూనే ఉన్నాయన్నారు. నిరుప యోగంగా ప్రాజెక్టు ఉంచడం బాధాకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రం లోని వైసీపీ ప్రభుత్వాలు రైతాంగ సమస్యలపై నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తున్నాయన్నారు. రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి బొత్సా సత్యనారాయణ ప్రాజెక్టుల సమస్యలను మరిచి ఇతర రంగాలకు చెందిన సమస్యలపై నిత్యం మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు మాట్లాడుతూ 12 టీఎంసీల నీళ్లను ఉపయోగించుకుని 80 వేల ఎకరాలు సాగవుతుందని, నీళ్లు కిందకు వెళ్తుండటంతో సాగు ప్రశ్నార్థకం అవుతోందన్నారు. గుండ్లకమ్మ ఆయకట్టు రైతు సంఘం ప్రధాన కార్యదర్శి వడ్డే హనుమారెడ్డి మాట్లాడారు. సీపీఐ ఒంగోలు నగర కార్యదర్శి పీవీఆర్ చౌదరి, సీనియర్ నాయకులు ఎస్‌డి సర్దార్, ఆచార్య రంగ కిసాన్ సంస్థ ప్రధాన కార్యదర్శి చుంచు శేషయ్య, రైతులు సిహెచ్ ఆదినారాయణ, ఐ ఆంజనేయులు, కట్టా పున్నయ్య, సిహెచ్ మల్లికార్జున, ఎం సత్యనారాయణ, రాజు, పి.వెంకటేశ్వర్లు, ఎస్‌కె గౌస్ తదితరులు పాల్గొన్నారు.

దళితుల రక్షణకు చర్యలేవి: అమరావతి బహుజన జేఏసీ

విశాలాంధ్ర బ్యూరో అమరావతి: తిరుమలలో కాలిబాటన వెళ్తున్న భక్తులు పులుల నోట పడకుండా, చేతికి చేతి కర్రలు ఇస్తున్న ప్రభుత్వం, రాష్ట్రంలో దళితులు, గిరిజనులపై జరుగుతున్న దాడులు, దౌర్జన్యాలు, హత్యలు, హత్యాచారాల నుంచి ఆత్మ రక్షణ కోసం వారి చేతికి ఏమిస్తారో? చెప్పాలని అమరావతి బహుజన జేఏసీ అధ్యక్షులు పోతుల బాలకోటయ్య ప్రశ్నించారు. ఈ మేరకు హోం మంత్రి తానేటి వనితకు, ప్రభుత్వ సలహాదారు సజ్జన రామకృష్ణా రెడ్డికి గురువారం ఆయన బహిరంగ లేఖ రాశారు. నాలుగున్నరేళ్ల వైసీపీ పాలనలో దళితులు బాధితులుగా మారారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని హెచ్ఆర్సీ, మహిళా కమిషన్ కార్యాలయాలు అలంకార ప్రాయంగా మారాయని విమర్శించారు. కేంద్రంలో ఉన్న రాజ్యాంగ సంస్థలు ప్రేక్షక పాత్ర పోషిస్తున్నాయన్నారు. ప్రతి పక్ష పార్టీల పాదయాత్రలో కూడా దళితులనే సమిధలుగా వాడుతున్నారని, ఈ కుట్రలలో ఏ ఒక్క ప్రాణం పోయినా, బాధ్యత ఎవరిదని ప్రశ్నించారు. ప్రభుత్వం ఆత్మ రక్షణ కోసం దళితులకు కర్రలిస్తుందో, కత్తులిస్తుందో చెప్పాలని డిమాండ్ చేశారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.